RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 180 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి మంగళవారం 30-6-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠ మాసం, తిథి॥ బ.పాడ్యమి పూర్తి, పూర్వాషాఢ పూర్తి, వర్జ్యం మ॥2.30 - 4.16, దుర్ముహూర్తం ఉ॥8.03-8.55, శుభ సమయం మ॥ 12.00-1.30, రాహుకాలం మ॥3.00-4.30, సూర్యోదయం ఉ॥ 5.31, సూర్యాస్తమయం సా॥ 6.34 గం॥

## సిఐ నాగరాజు కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా

**విజయవాడ, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సీఐ నాగరాజు కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈ కేసుకు సంబంధించి విజయవాడలో ఏజేఎమ్ కోర్టులో రెండు పిటిషన్లపై సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో మరిన్ని వివరాలను సేకరించేందుకు సీఐ నాగరాజును కస్టడీకి కోరుతూ సిట్ అధికారులు పిటిషన్ వేశారు. 12 రోజుల పాటు సీఐను కస్టడీలోకి ఇస్తే పూర్తి స్థాయిలో విచారిస్తామని కోర్టుకు తెలిపారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని సీఐ తరఫున న్యాయవాదిని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను జులై 1వ తేదీకి వాయిదా వేసింది. రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నాగరాజు.. తనకు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని, తన ఆరోగ్య కారణాల దృష్ట్యా బయటి ఆహారం పడదంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు.. సీఐ నాగరాజుకు ఇంటి నుంచి భోజనాన్ని తెప్పించుకునేందుకు అనుమతులిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# వినూత్న ఆలోచనల వేదికగా విశాఖ సీఐఐ సదస్సు

- భవిష్యత్ అభివృద్ధి దిశలపై విస్తృత చర్చలు
- ఫ్యూచరిస్టిక్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విశాఖలో జరగబోయే పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో కేవలం పెట్టుబడులు, వ్యాపార అవకాశాలపైనే కాకుండా పబ్లిక్ పాలసీలు, వినూత్న ఆలోచనలు, భవిష్యత్ అభివృద్ధి దిశలపై కూడా విస్తృత చర్చలు జరగాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రాంతీయ సదస్సుల్లో కూడా ఎంఓయూలు కుదుర్చుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానరంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ, ఆధ్యాత్మికత, స్ట్రెస్ ఫ్రీ వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. పెట్టుబడుల విలువ, ఎంఓయూల సంఖ్య కంటే నాలెడ్జ్ షేరింగ్ ఎంత మేరకు జరిగిందన్నదే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. నవంబర్ నెలలో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు నాయుడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. భాగస్వామ్య సదస్సులో జరిగే చర్చలు ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించేలా ఉండాలని, ఫ్యూచరిస్టిక్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చంద్రబాబు సూచించారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు సదస్సులో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతిలో సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కేంద్రం భవిష్యత్ నాయకత్వం, ఆవిష్కరణలు, ప్రపంచ స్థాయి విధాన చర్చలకు వేదికగా నిలవనుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'నేవిగేటింగ్ చేంజ్: లీడర్‌షిప్, టెక్నాలజీ, ట్రస్ట్ అండ్ ట్రేడ్ ఇన్ ఎ ట్రాన్స్‌ఫార్మింగ్ వరల్డ్' అనే థీమ్‌తో ఈ అంతర్జాతీయ స్థాయి సదస్సు జరగనుంది. ప్రధాన సదస్సుకు మిగతా 2లో..

## కోవిడ్ తరవాత పెరిగిన సైబర్ నేరాలు

- మోసపోతున్న వారిలో చదువుకున్నవారే ఎక్కువ... సైబర్ క్రైమ్ నివారణ్ ఆధునిక టెక్నాలజీ వినియోగం

- సైబర్ క్రైమ్స్ రికవరీ మేళాలో హోంమంత్రి అనిత




**విశాఖపట్నం, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కొవిడ్ తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఎన్డీఏ ప్రభుత్వం సైబర్ క్రైమ్‌పై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్నామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌కు టూల్స్ ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం సైబర్ క్రైమ్స్ రికవరీ మేళా నిర్వహించారు. ఈ మేళాకు ముఖ్య అతిథిగా హోం మంత్రి అనిత పాల్గొనగా, సీపీ శంఖబ్రాత బాగ్చి, పోలీస్ అధికారులు హాజరయ్యారు. సైబర్ క్రైమ్ బాధితులకు రికవరీ చేసి చెక్కులను హోం మంత్రి అందజేశారు.

చదువుకున్నవారే సైబర్ నేరాలకు గురవుతున్నారని హోం మంత్రి అనిత చెప్పుకొచ్చారు. సైబర్ నేరాలకు గురైన 310 మందికి సుమారు ఆరు కోట్ల రూపాయలు రికవరీ చేసి అందించామని తెలిపారు. సైబర్ క్రైమ్‌లో టెక్నాలజీని పూర్తిగా మిగతా 2లో..

## దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

-హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలి... రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలి

-ప్రారంభానికి ప్రధాని మోదీకి ఆహ్వానం... నిర్మాణ సంస్థలతో సీఎం చంద్రబాబు సమీక్ష




**అమరావతి, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో సీఎం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు మిగతా 2లో..

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

- షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమంలో మంత్రి లోకేశ్

- టెన్త్, ఇంటర్ షైనింగ్ స్టార్లకు నగదు పురస్కారాలు అందచేత



**అమరావతి, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులే విద్యా వ్యవస్థకు బ్రాండ్ అంబాసిడర్లని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరావతిలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమంలో ఆయన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి 55 మందికి రూ.30 వేల నగదు బహుమతి, మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన 61 మంది విద్యార్థులకు స్టార్స్‌కు ల్యాప్‌టాప్‌లు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విద్యా విధానం గురించి చర్చ జరిగేలా సంస్కరణలు చేపట్టామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి రెండు లక్షల మిగతా 2లో..

## విజయ్ ప్రభుత్వం కూలడం ఖాయం

- అది ఎంతో దూరం లేదన్న మాజీ సిఎం స్టాలిన్



**చెన్నై, జూన్ 29 (ఆర్ఎన్ఎ):** తమిళనాడు రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం ఐదేళ్ల పూర్తి పదవీకాలాన్ని పూర్తి చేయదని స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే మూడు నుంచి ఆరు నెలల్లో మిగతా 2లో..

## 'అయోధ్య' విచారణకు సుప్రీం తిరస్కరణ

- అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న



**న్యూఢిల్లీ, జూన్ 29 (ఆర్ఎన్ఎ):** అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ మిగతా 2లో..

## చెరువులో మామ, అల్లుడి మృతదేహాలు లభ్యం



**కృత్తివెన్ను, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలో విషాదం చోటుచేసుకుంది. చిన్నగొల్లపాలెం గ్రామంలోని చెరువులో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. బైక్‌కు తాళ్లతో కట్టిన మృతదేహాలను సోమవారం మధ్యాహ్నం స్థానికులు గుర్తించారు. మృతులను శనివారం అదృశ్యమైన మామ శెట్టి సుబ్బన్న, అల్లుడు గొలుసు అయ్యప్పగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు గ్రామస్థుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాలను తాళ్లతో బైక్‌కు కట్టి ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

- ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ



**విక్టోరియా, జూన్ 29 (ఆర్ఎన్ఎ):** భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷-డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ మిగతా 2లో..

## 4న ఖమేనీ అంత్యక్రియలు

- హాజరు కానున్న కేంద్రమంత్రి

**న్యూఢిల్లీ, జూన్ 29 (ఆర్ఎన్ఎ):** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత్ తరఫున విదేశాంగ శాఖ సహాయమంత్రి పబిత్ర మార్గరీటా హాజరుకానున్నట్టు సమాచారం. మంత్రి పబిత్రతో పాటు బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ కూడా వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా ఖమేనీ అంత్యక్రియలకు రావాలని ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవల ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో భారత్ తరఫున కేంద్ర మంత్రి, బిహార్ గవర్నర్ ఇరాన్‌కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా జన్మస్థలమైన మష్హద్ నగరంలోనే జులై 4న ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజు జరిగిన దాడిలోనే ఖమేనీ కన్నుమూశారు. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌ను ముందుండి నడిపించారు. ఖమేనీ స్మృత్యర్థం కోమ్ నగరంలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖమేనీ అంత్యక్రియలపై తొలి నుంచీ కొంత సందిగ్ధత నెలకొంది. జూన్‌లో అంత్యక్రియలు పూర్తవుతాయని మొదట్లో వార్తలు వెలువడ్డాయి. అయితే, జులైలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రభుత్వ మీడియా ఇటీవల ధ్రువీకరించింది. అంత్యక్రియలకు దాదాపు 20 మిలియన్ల మంది మిగతా 2లో..

లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాసక్తుల్ని, లక్ష్య సాధనలో సైతం చూపించాలి, విజయ రహస్యమంతా ఇదే. పరాజయాలను పట్టించుకోకండి, అవి సర్వ సాధారణం.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా !

ట్రంప్ ప్రంపచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లఫ్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి 38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది.అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి. వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.

## అన్నదాతలకు సిఎం ఏరువాక శుభాకాంక్షలు

**అమరావతి, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలకు సీఎం చంద్రబాబు ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలిపారు. భూమిని, పశుసంపదను పూజించి.. ప్రకృతితో అనుసంధానమయ్యే కార్యక్రమమిదని సీఎం అన్నారు. వ్యవసాయ రంగ బలోపేతానికి కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ సూచనలు పాటిస్తూ రైతన్నలు సాగుతో సిరులు పండించాలని కోరారు. అన్నదాతలకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏరువాక పున్నమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధం చాటి చెప్పేదే ఏరువాక పున్నమి అని పేర్కొన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# ముంబైలో భారీ వర్షం

**ముంబయి, జూన్ 29 (ఆర్ఎన్ఎ):** ముంబై మహానగరాన్ని భారీ వర్షాలుముంచెత్తాయి. ఆదివారం రాత్రి కేవలం నాలుగు గంటల్లోనే 100మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం ప్రభావంతో సబర్బన్ రైలు సర్వీసులకు అంతరాయం కలగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై నీరు నిలవడంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వీణా నగర్‌లో అత్యధికంగా 160.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ వెల్లడించింది. వర్షం కారణంగా అంధేరి ప్రాంతంలోని సబ్‌వే పూర్తిగా నీట మునిగింది. దీంతో ముందస్తు చర్యగా ఈ అండర్‌పాస్‌లో వాహనాల రాకపోకలను నిలిపివేసినట్లు బీఎంసీ వెల్లడించింది. మరోవైపు వాతావరణం అనుకూలంగా లేనందున విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి.

# రాధాగాయత్రి తల్లిదండ్రులకు భరోసా

### కేసు విషయంలో అండగా ఉంటామని హోంమంత్రి హామీ



**విశాఖపట్నం, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని రాధాగాయత్రి తల్లిదండ్రులకు హోం మంత్రి అనిత భరోసా ఇచ్చారు. రాధాగాయత్రీ కుటుంబ సభ్యులు తనను కలిశారని.. ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమని అన్నారు. రాధాగాయత్రి మరణంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు.ముస్సోరీలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన టెకీ రాధాగాయత్రి తల్లిదండ్రులు సోమవారం హోం మంత్రి అనితను కలిశారు. కూతురి మరణం, అల్లుడు శ్రీచరణ్ ప్రవర్తనపై అనుమానాలను హోం మంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని రాధాగాయత్రి తల్లిదండ్రులు సుధాకర్, సత్యవతి కోరారు. ఇప్పటికే అక్కడి పోలీసులతో ఇన్‌ఛార్జి జాయింట్ సీపీ మాట్లాడి కేసుపై వివరాలను తీసుకున్నారని ఈ సందర్భంగా హోం మంత్రి తెలిపారు. ఉత్తరాఖండ్ డీజీపీతో మాట్లాడమని ఏపీ డీజీపీకి చెప్పారన్నారు. రాధాగాయత్రి మృతిపై కుటుంబసభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆమె మరణం వెనుకున్న రహస్యం బయటపడాలని.. నిందితుడికి కఠిన శిక్ష పడాలని అన్నారు. రాధాగాయత్రి తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. హోం మంత్రిని కలిసిన అనంతరం రాధాగాయత్రి తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడుతూ.. 'మా బాధను హోం మంత్రి అనితతో చెప్పుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హోం మంత్రి భరోసా ఇచ్చారు. హోం మంత్రి భరోసాతో మాకు ధైర్యం కలిగింది. రాధాగాయత్రి మృతి విషయంలో మాకు న్యాయం చేయాలి. శ్రీచరణ్ ఒకచోట ఉండకుండా పరిగెడుతున్నాడు' అంటూ గాయత్రి తల్లిదండ్రులు వెల్లడించారు.

# కూటమి కృషితో సీమకు మహర్దశ

### జగన్ హయాంలో రక్తపుటేరులు పారించారు.... ఏపీ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి వ్యాఖ్య



**అమరావతి, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధిలో పరుగులు పెడుతుందని ఏపీ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి వ్యాఖ్యానించారు. అభివృద్ధికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారని పునరుద్ఘాటించారు. ప్రతిపక్ష హోదా దక్కని వాళ్లు కూడా సిగ్గు, శరం లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రప్పా, రప్పా అంటే పారిశ్రామికవేత్తలు వస్తారా...? అని మంత్రి ప్రశ్నించారు. గతంలో ఉన్న పరిశ్రమలను సైతం రాష్ట్రం నుంచి తరిమికొట్టారని ఆగ్రహించారు.ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో రాయలసీమలో రక్తపుటేరులు పారించారని ధ్వజమెత్తారు. సోమవారం అమరావతి వేదికగా మంత్రి జనార్ధనరెడ్డి మీడియాతో మాట్లాడారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలు రాయలసీమకు వస్తున్నాయని వివరించారు.

రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి డిపాజిట్‌లు కూడా రావని మంత్రి బీసీ జనార్ధనరెడ్డి విమర్శించారు.

## మొదటి పేజీ తరువాయి

## వినూత్న ఆలోచనల వేదికగా విశాఖ సిఐఐ సదస్సు

ముందు విశాఖపట్నం, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలలో ప్రాంతీయ భాగస్వామ్య సమావేశాలు నిర్వహించే అంశంపై కూడా చర్చ జరిగింది. ఈ సమావేశాల ద్వారా వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులను భాగస్వామ్య సదస్సుకు అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఎంఓయూలు, మినిస్టీరియల్ సెషన్లు, ప్లీనరీ సమావేశాలు, దేశాల వారీగా ప్రత్యేక సెషన్లు, బీ2బీ (బిజినెస్ టు బిజినెస్), బీ2జీ (బిజినెస్ టు గవర్నమెంట్) సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, విదేశీ ప్రతినిధి బృందాలను విశాఖ సదస్సుకు ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు. సదస్సుకు విస్తృత ప్రచారం కల్పించేందుకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశ, విదేశాల్లో రోడ్ షోలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ నగరాల్లో ప్రత్యేక రోడ్ షోలు చేపట్టనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కోవిడ్ తరవాత పెరిగిన సైబర్ నేరాలు

వాడుతున్నామని వివరించారు. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సైబర్ క్రైమ్‌లో ఎవరైనా మోసపోతే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. అలాగే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను అందజేస్తున్నామని చెప్పారు. సైబర్ నేరాల దర్యాప్తులో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలకు బాగా చదువుకున్నవారు కూడా బలవుతున్నారని హోంమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక, సైబర్ నేరాల నియంత్రణ లో ప్రజల అప్రమత్తత కూడా కీలకమని హోంమంత్రి అన్నారు. ప్రభుత్వం సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతుందని, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖ పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. భవిష్యత్ నగరంగా నిర్మిస్తు?న్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

## 'అయోధ్య' విచారణకు సుప్రీం తిరస్కరణ

ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖలో పలు సంస్కరణలు చేపట్టామని, వాటి ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగిందని తెలిపారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ఎవరూ ముందుకు రాకపోయినా, ఇప్పుడు సీట్ల కోసం సిఫార్సులు వచ్చే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో రాజకీయాలకు చోటు ఉండకూడదని నిర్ణయించామని, పాఠశాలల్లో రాజకీయ ప్రచారానికి అవకాశం ఇవ్వబోమని చెప్పారు. వ్యక్తిగత రాజకీయ ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ, 2019లో మంగళగిరి నియోజకవర్గంలో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయానని, తొలి రోజు బాధ కలిగినా ఆ తర్వాత అదే తనలో మరింత కసిని పెంచిందని చెప్పారు. విద్యా రంగంలో మార్పు తీసుకురావడానికి రెండేళ్లు కష్టపడ్డానని, ఇప్పుడు ఆ ఫలితాలు కనిపిస్తున్నాయని లోకేష్ పేర్కొన్నారు.

## విజయ్ ప్రభుత్వం కూలడం ఖాయం

విజయ్ మైనారిటీ ప్రభుత్వం కూలిపోవచ్చని స్టాలిన్ అన్నారు. ఇది నిలబడే ప్రభుత్వం కాదంటూ ప్రకటన చేశారు. తాజాగా డీఎంకేలో కొందరు కార్యకర్తల చేరిక సందర్భంగా నిర్వహించిన సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం స్థిరంగా కనిపించడం లేదని, రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో పరిస్థితులు ఎలా మారతాయో వేచి చూడాలని అన్నారు. 'మా ప్రగతిశీల కూటమిలోని కొన్ని పార్టీల వ్యూహాత్మక పొత్తు, మద్దతు వల్లే ఈ టీవీకే ప్రభుత్వం మనుగడ సాగించగలుగుతోంది' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఇది అస్థిరమైన ఏర్పాటు. ఈ వాహనం ఏ కూడలిలో అకస్మాత్తుగా ఆగిపోతుందో మనకు తెలియదు అందుకే నేను మీకు చెబుతున్నాను.. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. అవి మూడు నెలల్లో జరగవచ్చు, లేదా ఆరు నెలల్లో జరగవచ్చు. ఐదేళ్ల కాలం పాటు వేచి ఉండే స్థితిలో మనం లేము. ఎలాంటి రాజకీయ పరిస్థితికైనా నూటికి నూరు శాతం మనం సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు స్టాలిన్ సూచించారు.

## 4న ఖమేనీ అంత్యక్రియలు

హాజరుకానున్నట్టు ఇరాన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కూడా ఇరాన్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఇక అయతొల్లా ఖమేనీ అనంతరం ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉన్నారు. అయితే, ఆయన ఎక్కడున్నారనే దానిపై స్పష్టత లేదు. మొజ్తాబా ఆరోగ్యంపై కూడా పలు వార్తలు వెలువడ్డాయి. ఆయన కోమాలో ఉండే అవకాశం ఉందని సీనియర్ యూఎస్ అధికారులు పలుమార్లు తెలిపారు.

## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.


Truhome FINANCE

**ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** (మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

ప్రధాన కార్యాలయం: లెవెల్ - 3, వోకార్డ్ టవర్స్, ఈస్ట్ వింగ్ C-2, జీ బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబై – 400051
ఫోన్: 1800 102 4345 ; వెబ్‌సైట్: www.truhomefinance.in
నమోదిత కార్యాలయం: శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోర్ నం. 5 (పాత నం. 11), 2వ లేన్, సెనటాఫ్ రోడ్, అల్వార్‌పేట్, టెయినాంపేట్, చెన్నై – 600018

**అనుబంధం – IV-A [రూల్ 8(6) నిబంధన ప్రకారం] స్థిరాస్తుల అమ్మకానికి నోటీసు**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం, అలాగే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) నిబంధనల మేరకు, అచల ఆస్తుల విక్రయం కోసం ఈ ఈ-వేలం విక్రయ నోటీసు జారీ చేయబడుచున్నది.
సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయబడునది ఏమనగా, క్రింద వివరించబడిన అచల ఆస్తులు, ఇవి ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) కు గిరవంగా/భద్రతగా ఉంచబడినవి. ఆ ఆస్తులపై ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధికృత అధికారి భౌతిక స్వాధీనంపొందినది. ఆ ఆస్తులను "ఎక్కడ ఉన్నదో అక్కడే", "ఏ స్థితిలో ఉన్నదో అదే", "ఏమైతే ఉందో అదే" అనే ప్రమాణాలపై, 04-08-2026 తేదీన ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఈ-వేలం ద్వారా విక్రయించబడును.
ఈ విక్రయం ద్వారా రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారుల నుండి ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చెల్లించవలసిన బాకీ మొత్తం వసూలు చేయబడును. రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారుల వివరాలు, బాకీ మొత్తం, ఆస్తి సంక్షిప్త వివరణ, రిజర్వ్ ధర, (EMD), మరియు ఆస్తి పరిశీలన తేదీలు తదితర వివరాలు క్రింది పట్టికలో ఇవ్వబడినవి.

| రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారుల పేర్లు | వసూలు మొత్తం మరియు డిమాండ్ నోటీసు తేదీ | రిజర్వ్ ధర (రూ.) & బిడ్ పెంపు | వేలం తేదీ & సమయం | సంప్రదించవలసిన వ్యక్తి వివరాలు – (AO) మరియు డిస్పోజల్ బృందం) |
|---|---|---|---|---|
| శ్రీమతి కోటకొండ కామేశ్వరమ్మ, భర్త: శ్రీ కోటకొండ సుబ్బయ్య శ్రీ కోటకొండ సుబ్బయ్య, తండ్రి: శ్రీ కోటకొండ సుబ్బయ్య చిరునామా: డి. నెం. 2-71, 3వ వీధి, నక్క గోపాల్ నగర్, కొత్తూరు, అంబాపురం,ఆంధ్రజేసరి నగర్, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ – 524004. రుణ ఖాతా సంఖ్య: SHLHNELR0001039 స్వాధీనపు తేదీ & రకం: 31 మార్చి, 2026, భౌతిక స్వాధీనం తెలిసిన భారాలు: తెలియదు | డిమాండ్ నోటీసు తేదీ - 11-12-2025 రుణ ఖాతా సంఖ్య: SHLHNELR0001039 కు సంబంధించి 30-11-2025 నాటికి డిమాండ్ నోటీసు మొత్తం రూ.10,19,126/- (అక్షరాలా: పది లక్షల పంతొమ్మిది వేల నూట ఇరవై ఆరు రూపాయలు మాత్రమే). | రూ.5,50,000/- (ఐదు లక్షల యాభై వేల రూపాయలు) బిడ్ పెంపు: రూ.10,000/- మరియు దాని గుణిజాలలో. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) (రూ.): రూ.5,5000/- (యాభై ఐదు వేల రూపాయలు మాత్రమే) EMD సమర్పించడానికి చివరి తేదీ : 3 ఆగస్టు, 2026 సమయం: ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 05.00 గంటల వరకు. | 04-ఆగస్టు-2026 & వేలం సమయం: ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంటల వరకు | శ్రీ పి. అంజిబాబు & శ్రీ బి. సతీష్ కుమార్ 9966365296 & 9849225412 ఆస్తి పరిశీలన తేదీ : 03-ఆగస్టు-2026 |

**Description of Property**

ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా, నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నెల్లూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు బిట్-1, కొత్తూరు గ్రామం, ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా, డోర్ నెం: 20/1A-3-38/4 (సాంకేతిక నివేదిక ప్రకారం), సర్వే నెం. 2087/1 పరిధిలో ఉన్న 20 అంకణాలు లేదా 160 చదరపు గజాల ఖాళీ స్థలం ఈ క్రింది వాటిచే సరిహద్దులుగా ఉంది. ఉత్తరం: గుంజి పెంచలయ్య ఇల్లు, దక్షిణం: రోడ్డు, తూర్పు: రోడ్డు, పడమర: రోడ్డు. ఇది ఎస్.ఆర్.ఓ 917 (నెల్లూరు) సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా మరియు నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో ఉంది.

1) విక్రయానికి సంబంధించిన పూర్తి నిబంధనలు మరియు షరతుల కోసం: ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) వెబ్‌సైట్‌ను చూడండి
2) వేలంలో పాల్గొనదలచిన బిడ్డర్లు తమ EMD మొత్తాన్ని, RTGS/NEFT ద్వారా క్రింద పేర్కొన్న ఖాతా వివరాలకు జమ చేయవలెను: బ్యాంక్ పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్; శాఖ: బాంద్రా కుర్లా కాంప్లెక్స్, ముంబై; బ్యాంక్ ఖాతా సంఖ్య : 911020045677633; IFSC కోడ్: UTIB0000230.

స్థలం: నెల్లూరు
తేదీ: 30-06-2026

సంతకం/- అధీకృత అధికారి - ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వం శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

# స్వామి రెడ్డి పల్లిలో అత్యంత వైభవంగా 'ఏరువాకపౌర్ణమి'

### - రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని




**చంద్రగిరి, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సామిరెడ్డిపల్లి పంచాయతీలో అత్యంత వైభవంగా జరిగిన 'ఏరువాక పౌర్ణమి' మహోత్సవ కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యే కి అధికారులు, కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గ యువత బాణాసంచా కాలుస్తూ, మహిళలు సాంప్రదాయబద్ధంగా హారతులు ఇచ్చి ఆహ్వానించారు.ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామంలోని వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం, రైతులతో కలిసి పొలంలో నాగలి పట్టి దుక్కి దున్ని ఏరువాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, పనిముట్లు మరియు వ్యవసాయ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సామిరెడ్డిపల్లి పరిధిలోని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అన్ని రంగాల అభివృద్ధిలో ముందుండి ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే నాని కొనియాడారు. ముఖ్యంగా ప్రభుత్వం రైతాంగం, పారిశ్రామిక రంగం, ఐటీ రంగాన్ని ఎల్లప్పుడూ సమానంగా ప్రోత్సహిస్తుందని.. రైతుల వల్ల సమాజానికి సుఖం, పారిశ్రామికీకరణ వల్ల ఆర్థిక వృద్ధి, ఐటీ రంగం వల్ల యువతకు భవిష్యత్తు ఎదుగుదల లభిస్తాయని స్పష్టం చేశారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని, రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం మామిడి రైతులను విశేషంగా ఆదుకుంటూ వస్తోందని గుర్తుచేశారు. ఇటీవల జరిగిన రెండేళ్ల విజయోత్సవ సభలో మామిడి రైతులు ముఖ్యమంత్రిని ఆదుకోవాలని అడగడంతో, రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను కూడా పక్కనపెట్టి కిలోకు 4 రూపాయల చొప్పున మొత్తం 180 కోట్ల రూపాయలను అడిగిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు శాంక్షన్ చేశారన్నారు. ఈ నిధుల ద్వారా మన చంద్రగిరి నియోజకవర్గంలోని సుమారు 26 వేల మంది మామిడి రైతులకు 17 కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు ఏటా 20 వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని అందించడం జరుగుతోందని.. కేవలం మాటలు చెప్పే పాత ప్రభుత్వాలు పోయి, నేడు కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్థ నాయకత్వంలో, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలతో రైతు పక్షపాత ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొనియాడారు. రైతులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వాలకు మనుగడ ఉండదని, కాబట్టి అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ రైతులకు సహకరిస్తూ వారికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. 'రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది.. రాష్ట్రం బాగుంటే నేను కూడా బాగుంటాను' అని ఆయన వ్యాఖ్యానించారు. నియోజకవర్గం లోని సాగునీటి, తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే వివరించారు. పదిపట్ల బైలు నుండి కల్యాణి డ్యామ్‌కు, కొటాల చెరువుకు నీటిని తరలించే ప్రాజెక్టుకు ఇప్పటికే నిధులు మంజూరై, పనులు ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. అలాగే పదిపట్ల బైలు నుండి రామ సముద్రం చెరువుకు కూడా సాగునీటిని తీసుకువచ్చేలా నిధుల అంచనాలను సిద్ధం చేశామని, త్వరలోనే ఆ నిధులు కూడా మంజూరై పనులు పూర్తవుతాయని స్పష్టం చేశారు. దీనివల్ల భూగర్భ జలమట్టం మరియు భూమిలో తేమ శాతం గణనీయంగా పెరిగి, చుట్టుపక్కల గ్రామాలకు నీటి కొరత తీరుతుందని.. తద్వారా రైతులు కేవలం వర్షాల మీదనే ఆధారపడకుండా ఏడాది పొడవునా పంటలు పండించుకునే సువర్ణ అవకాశం లభిస్తుందని రైతులకు వివరించారు. కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే నాని ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. రోజురోజుకూ చంద్రగిరి నియోజక వర్గం అభివృద్ధి చెందుతుండటం చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, వారి అనుకూల పత్రికలు నిత్యం అవాస్తవాలు రాస్తూనే ఉంటాయని, వాటిని ఎవరూ పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. మన మొదటి ప్రాధాన్యత ఎప్పుడూ అభివృద్ధి వైపే ఉండాలని, మనం ఎక్కడా తప్పు చేయడం లేదు కాబట్టి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఒకవేళ క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు దాన్ని అస్సలు ఆలస్యం చేయకుండా, వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా అడుగులు వేయాలని సూచించారు. రెండు రోజుల క్రితం పాకాల మండలంలో జరిగిన ఒక వివాదాన్ని ప్రతిపక్షాలు ఏ విధంగా మసిపూసి మారేడు కాయ చేసి, ప్రజలను నమ్మించాలని చూశాయో కూటమి శ్రేణులంతా గమనించాలని కోరారు. ఆరోజు ఆ సమస్య తలెత్తినప్పుడే మనవాళ్లు ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకొని ఉంటే బాగుండేదన్నారు. ప్రతిపక్ష నేతలకు ఎలాంటి అవగాహన లేదని, వారు కేవలం అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మండి పడ్డారు. దానికి నిదర్శనమే ముద్దలపల్లిలో జరిగిన సంఘటన అని.. ఆరోజు మద్యం మత్తులో, గంజాయి తాగి కొందరు వివాదాన్ని సృష్టిస్తే, ఆ అరాచక శక్తులను ప్రతిపక్ష పార్టీ వెనకేసుకు వచ్చే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. కాబట్టి ఎక్కడ ఏ సమస్య వచ్చినా కూటమి నాయకులు తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలబడాలని ఆదేశించారు. ప్రస్తుతం పాకాల మండలంలో ఉన్న అధికారులు ఎంతో నిబద్ధతతో, మంచిగా పనిచేస్తున్నారని, వారిని ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా నాయకులంతా అధికారులతో సమన్వయం తో కలిసి ముందుకు సాగాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులను జూమ్ కాన్ఫరెన్స్‌ల ద్వారా ఇళ్లకే పిలిపించుకుని ఎలా రకరకాలుగా వేధించి, ఇబ్బంది పెట్టారో ఆ చేదు నిజాలు అధికారులకు కూడా బాగా తెలుసన్నారు. మనం అలా కాకుండా అన్ని వర్గాలను, రంగాలను కలుపుకొని ముందుకు సాగితే వంద శాతం విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పాకాల మండల సమగ్ర ప్రగతి కొరకు రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసి రావాలని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాను ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రకటించారు.సామిరెడ్డిపల్లిలో జరిగిన ఈ మహోత్సవంలో జిల్లా ఉన్నతాధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది, నియోజకవర్గ రైతాంగం, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## చోద్యం చూస్తున్న ప్రభుత్వ అధికారులు

**సత్యవేడు, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**సత్యవేడు మండలం చెన్నేరి గ్రామంలో నివాస గృహాలకు అతి సమీపంలో, గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన జగనన్న ఇంటి పట్టాల పక్కనే కంకర క్వారీలు పేరిట ఎర్ర మట్టి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం, కంకర క్వారీలకు సంబంధించిన లారీలను గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. తమ ఇళ్లకు, ఇంటి పట్టాలకు ఎలాంటి నష్టం కలగకుండా క్వారీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.గ్రామస్తుల నిరసనతో స్పందించిన నిర్వాహకులు, కంకర తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చివేసే పనిచేస్తున్నట్లు సమాచారం.అయితే, క్వారీ అనుమతులు ఒకరి పేరుపై ఉండగా, తవ్వకాలు నిర్వహణ మరొకరు చేస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అలాగే సత్యవేడు మండలంలో ఒక ప్రాంతానికి అనుమతులు తీసుకుని, మరో ప్రాంతంలో తవ్వకాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కూడా నివాసము ఉంటున్న గృహాల వద్ద రాత్రిపూట తవ్వకాలు జరపడంతో, భారీ స్థాయిలో గ్రామస్తులందరూ నిరసనను తెలపడంతో అప్పటిలో ప్రభుత్వ,పోలీస్ అధికారులు, రెవిన్యూ అధికారులు, నేరుగా క్వారీ నడుస్తున్న ప్రాంతానికి వచ్చి సందర్శించి,మా ఇండ్ల సమీపంలో ఉన్నటువంటి పెద్ద పెద్ద గుంతలను మూడు రోజులపాటు పూడ్చివేసి ఆ ప్రాంతాన్ని వదిలివేసి మరొక ప్రాంతంలో క్వారీలను నడపడం జరిగింది. అప్పటిలో కొంతమంది ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు సహకారం ఇప్పటికీ మరువలేమంటూ ఆ గృహాల్లో నివసిస్తున్న గ్రామస్తులు వాపోయారు.స్థానిక అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు క్వారీల నిర్వహణపై తగిన పర్యవేక్షణ చేపట్టడం లేదని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన శంకర్ రెడ్డి

**సత్యవేడు,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**సత్యవేడు మండలం, మదనంబేడు గ్రామంలో కొనసాగుతున్న సర్ కార్యక్రమాన్ని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి పరిశీలించారు.సోమవారం ఆయన స్థానిక టిడిపి నాయకులతో కలిసి బివిఓల్లు నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి బివిఓలు ఇంటింటికి వెళ్లి ఎన్రోల్మెంట్ ఫామ్లు పంపిణీ చేసి పూర్తయిన వాటిని తిరిగి తీసుకోవాలన్నారు. ఎన్రోల్మెంట్ ఫామ్స్ లోని వివరాలను పూరించడంలో తప్పులు తడకగా లేకుండా చూసుకోవాలన్నారు.బివిఓల్లు కూడా దీనికి సహకారం అందించాలన్నారు.సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి స్థానిక టిడిపి నాయకులు కూడా వారి వారి పరిధిలో పర్యవేక్షించాలన్నారు. ఇప్పటికే ఓటరు కార్డులో ఫోటోలు సరిలేని పక్షంలో కొత్తగా తీసిన లేటెస్ట్ ఫోటోలు కూడా బివిఎల్ఓలకు ఫారంతో పాటు అందించాలన్నారు. ఓటు మ్యాపింగ్ విషయంలోనూ పారదర్శంగా ముందుకు వెళ్ళాల్సి ఉందన్నారు.సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆయన కోరారు.వయసు 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి వారి వద్ద నుంచి కొత్త ఓటు నమోదు చేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో సత్యవేడు టిడిపి మండల అధ్యక్షులు పరుచూరిశివకుమార్,క్లస్టర్ ఇంచార్జి జెరిబాబు, నాగలాపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మురళి( చికెన్ చిన్న), సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు కృష్ణయ్య,తిరుపతి పార్లమెంట్ సభ్యులు శివయ్య,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు తులసిరామ్,కోక్లస్టర్ హేమంత్ కుమార్, నాయకులు సునీల్ జైన్,గురుమూర్తి,ఆనందయ్య, సంపత్,సురేష్,గోపి,బూత్ ఇంచార్జి వెట్రివేల్,పార్టీ శ్రేణులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బయటకొడియం బేడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**నాగలాపురం, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**నాగలాపురం మండల పరిధిలోని బయట కొడియం బేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటైనర్ ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన సెల్వం 52 మృతి చెందాడు. ఈ ఘటనతో ఆగ్రహించిన గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రమాదాలు తరచూ జరుగుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపించారు. ప్రమాదాల నివారణకు వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రహదారి భద్రతను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.గ్రామస్తుల ఆందోళనతో రహదారిపై సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు రోడ్డుపై నుంచి లేచేది లేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో పాటు గ్రామస్తులతో చర్చలు జరిపారు. అధికారులు వెంటనే స్పందించి శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యా సంస్థల ఆవరణలో సిసి కెమెరాలు అమర్చుకోవాలి: సిఐ

**చంద్రగిరి,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**చంద్రగిరి మండల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల ఆవరణలో సదరు యాజమాన్యం సిసి కెమెరాలు అమర్చుకోవాలి అని సిఐ సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు నిఘా వర్గాలకు లభించిన సమాచారం మేరకు మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ చెందిన కూరవ,ధాన్,చెడ్డీ గ్యాంగ్ లు రాష్ట్రంలోకి చొరబడి 2025లో అనంతపురం, కడప జిల్లాల్లో 2026లో దువ్వాడ, రాజమండ్రి, ఏలూరు, తిరుపతి జిల్లాల్లోని నారాయణవనం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇంజనీరింగ్ కళాశాలలోకి రాత్రి వేళల్లో గ్యాంగ్ ప్రవేశించి నగదు నిల్వ వుంచిన లాకర్లను పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు సమాచారం అందినది. ప్రస్తుతం విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్న తరుణంలో కళాశాలలను లక్ష్యంగా చేసుకొంటున్నందున చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మరియు భద్రతా సిబ్బందితో సమావేశమై పోలీసు వారి సూచనలు పాటించాలని కోరుతున్నాము. 1.కార్యాలయ లాకర్లలో రాత్రివేళల్లో నగదు నిల్వ ఉంచవద్దు. 2.రోజూ వారీ వసూళ్లను అదే రోజున బ్యాంకులో జమ చేయాలి. 3.కళాశాల ప్రాంగణంలో 24 గంటలు పనిచేసే విధంగా సిసి కెమెరాలు అమర్చుకోవాలి. కనీసం 30 రోజుల నిడివి ఫుటేజ్ భద్రపరుచుకోవాలి. 4.రైల్వే ట్రాక్లు, రైల్వే స్టేషన్లు మరియు ఒంటరి ప్రాంతాలకు చేరువలోని కళాశాలలు వెనుక భాగంలో ఫ్లడ్ లైట్స్ మరియు అదనంగా సిసి కెమెరాలు అమర్చుకోవాలి. 5.రాత్రి వేళల్లో భద్రతా సిబ్బంది ద్వారా తరచూ గస్తీ నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి అని తెలిపారు.

## వృద్ధురాలకు న్యాయం చేస్తా ఎమ్మార్వో

**కందుకూరు ,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సార్ గత 12 సంవత్సరాలుగా తన తండ్రి మేకల రమణయ్య నుండి వారసత్వంగా వీలునామా ద్వారా నాకు సంక్రమించిన 56 సెంట్లు భూమి మీరైనా నాకు ఎక్కడ ఉందో చూపించండి సార్ మీకు తెలియకపోతే ఆ భూమి ఎక్కడ ఉందో నేను చూపిస్తాను నాకు న్యాయం చేయండి భూమి ధరలు పెరగటంతో ఒక కళాశాల యాజమాన్యం తమ రాజకీయ పలుకుబడితో భూమి సొంతం చేసుకునేందుకు నిరంతరం ప్రయత్నాలు చేస్తూ పట్టాలు పాస్ పుస్తకాలు పొందిన ఒంటరి పోరాటం చేస్తున్న భిన్నాలు లేదు అన్న గతంలోని అధికారులు నా భూమి ఎక్కడ ఉందో నేను ఎవరికీ అమ్మ లేదు కదా నేనే స్వయంగా భూమి చూపిస్తానన్న నాకెందుకు న్యాయం జరగటం లేదు అర్థం కావటం లేదు సార్ మీరైనా న్యాయం చేయాలంటేనే ఒక వృ ద్ధు రాలైన మహిళా రైతు జిల్లెలమూడి అన్నమ్మ తాసిల్దార్ మురళీకి సోమవారం వినతి పత్రం అందజేసి తన ఆవేదన వ్యవస్థలో రాజకీయ పలుకుబడి ఎంత దారుణంగా ఉందో కన్నీటి పర్యంతరమై మొరపెట్టుకున్నారు ఇదే సందర్భంలో తాసిల్దార్ తో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్కు సబ్ కలెక్టర్లకు ఎన్నో అర్జీలు ఇచ్చానని నా రాజకీయ పలుకుబడి సరిపోవటం లేదని అవతల వైపు కళాశాల యాజమాన్యం రాజకీయ పలుకుబడి ముందు నేను శూన్యంగా మారానని నగదు ఆస్తులు కోసం కాదు తన తండ్రి నుండి వచ్చిన వారసత్వ సంపద నిలబెట్టుకోవాలన్న తపన తనదని చివరి శ్వాస వరకు భూమి కోసం పోరాటం చేస్తానని వివరించి నాకు న్యాయం చేయండి సార్ న్యాయం చేస్తారన్న నమ్మకం ప్రతి ఒక్క ప్రజానీకం చెప్తున్నారు సార్ అని ఆవేదన వ్యక్తం చేశారు స్పందించిన తాసిల్దార్ విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## తంబళ్లపల్లె మల్లయ్యకొండపై మైనింగ్ తవ్వకాలంటూ వైసీపీ దుష్ప్రచారం

### - భక్తుల,ప్రజల మనోభావాలు మాకు ముఖ్యం
### - ఎమ్మెల్యేలు కిషోర్ కుమార్ రెడ్డి,షాజహాన్ బాషా స్పష్టం
### - శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామిని దర్శించుకున్న నేతలు

**మదనపల్లె /తంబళ్లపల్లె, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రసిద్ధిగాంచిన మల్లయ్య కొండ,సాదుకొండ,ఇనుముకొండలలో ఇనుప ఖనిజాల కోసం తవ్వకాలు జరుపుతున్నారని,ప్రభుత్వం ఏదో చేసేస్తోందని తంబళ్లపల్లె వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి,వైసీపీ నాయకులు ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆరోపించారు.సోమవారం తంబళ్లపల్లె మండలం మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డితో పాటు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా,టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఫర్వీన్ తాజ్,సీనియర్ నేత ఆర్.జె.వెంకటేష్, మల్ రెడ్డి కొండ్రెడ్డి,రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్, టిడిపి సీనియర్ నాయకులు కట్టా దొరస్వామి నాయుడు,గండికోట గణేష్ బాబు ఇతర ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మల్లయ్యకొండ అంటే మాప్రాంత ప్రజలకు పవిత్రమైన దైవక్షేత్రమని,ఇక్కడ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయని వైసీపీ నేతలు కావాలని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని,ప్రజల మనోభావాలతో చెలగాటం ఆడటమే వారి పని విమర్శించారు. అలాంటిది ఏదీ జరగడం లేదని,జరగనివ్వమని స్పష్టం చేశారు.గతంలో 2011లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తవ్వకాల కోసం ప్రచారం జరగడంతో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దఎత్తున ఉద్యమం చేపట్టారని ఆయన గుర్తుచేశారు.చంద్రబాబు నాయుడుకు విమర్శించే అర్హత మీకు లేదని ఆయన హెచ్చరించారు.జనవరి నెల 22వ తేదీ 2024 సంవత్సరంలో ఎర్రకొండకు టెండర్లు పిలిచింది వైసీపీ ప్రభుత్వమేనని మళ్లీ ప్రభుత్వంపైన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఇలాంటి ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయండి

### - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

**చిల్లకూరు,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం లోని చిల్లకూరు మండలం లోని పునపరివారిపాలెం లో పర్యటించే అవకాశం ఉందని ఈ సందర్భంగా అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా సోమవారం చిల్లకూరు మండలం లోని పునపరివారిపాలెంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఎస్పి అజిత వేజెండ్ల, జేసి మొగిలి వెంకటేశ్వర్లు లతో కలసి ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని, అలాగే త్రాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, డిఆర్డీఏ, మెప్మా పిడీలు నాగరాజ కుమారి, కిరణ్ కుమార్, డిపివో వసుమతి, పౌర సరఫరాల శాఖ డీఎం అర్జున రావు, డిఎస్ఓ పుల్లయ్య, డీఎస్పీ గిరిధర్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### -డి ఆర్ ఓ నరసింహులు

**తిరుపతి,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కార దిశగా కృషి చేయాలని డి ఆర్ ఓ నరసింహులు తెలిపారు.సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు శివ శంకర్ నాయక్ భరత్ నాయక్ రోస్మండ్ తో కలిసి అర్జీ దారుల నుంచి అర్జీలను స్వీకరించారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి డి ఆర్ ఓ వినతిపత్రాలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిఆర్ఓ మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం వచ్చిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ లో మొత్తం 332 అర్జీలు రాగా అందులో రివిన్యూ శాఖకు సంబంధించినవి 178 ఉన్నాయి.మిగతావి శాఖల వారీగా దేవాదాయ శాఖ -34, పంచాయతీ రాజ్ -21, గురుకుల - 19, పోలీస్ శాఖ-16, సెర్ప్- 11, విద్యాశాఖ -10, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ -6, నీటిపారుదల శాఖ -5, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్-4, వ్యవసాయ శాఖ -4, కుటుంబ సంక్షేమ శాఖ -4, విద్యుత్ శాఖ-3, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్-2, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ -2 సాంఘిక సంక్షేమ శాఖ-2, మత్స్యశాఖ -2, గృహ నిర్మాణ శాఖ - 2, టిడ్కో -1, తుడా -1, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు-1,, నైపుణ్య అభివృద్ధి - 1, రిజిస్ట్రార్ జె ఎన్ టి యు - 1, గిరిజన సంక్షేమ శాఖ-1, గ్రామీణ అభివృద్ధి-1.అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వేగవంతంగా పరిష్కారం చూపాలని డిఆర్ఓసూచించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆత్మ నిర్భర్ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

### -వీధి వ్యాపారులకు మెప్మా సి.ఎం.ఎం. కృష్ణవేణి సూచన

**తిరుపతి,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి పథకాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సి.ఎం.ఎం. కృష్ణవేణి తెలిపారు. సోమవారం మెప్మా ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం లో స్వనిధి మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి పాల్గొని ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి గూర్చి వివరించారు. ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకాన్ని మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టి ఇన్ మున్సిపల్ ఏరియాస్, ఏపీ మెప్మా సంయుక్తంగా వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తాయని తెలిపారు. దీని ద్వారా పూచి కత్తు లేకుండా సులభంగా రుణాలు పొందవచ్చునని తెలిపారు. మొదటి విడత రూ.15 వేలు రుణం పొంది, ఆ రుణాన్ని 11 నెలలు సకాలంలో తిరిగి చెల్లిస్తే, రెండవ విడతకు అర్హులవుతారని, రెండవ విడత రూ.25 వేల రుణాన్ని 18 నెలలు సకాలంలో తిరిగి చెల్లిస్తే, మూడవ విడత రూ.50 వేలు రుణం పొందవచ్చునని తెలిపారు.ఈ రుణాన్ని 36 నెలలు సకాలంలో తిరిగి చెల్లించాలని తెలుప్పారు.సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ 7శాతం ఉంటుందని, డిజిటల్ లావాదేవీలు ప్రోత్సహించుట కొరకు క్యాష్ బ్యాక్ ప్రోత్సాహకాలు క్యాష్ బ్యాక్ నెలకు వంద రూపాయలు పొందవచ్చునని తెలిపారు.2035 సంవత్సరం వరకు క్రెడిట్ కార్డ్ సదుపాయం ఉంటుందని, ఒకటి, రెండు విడతలు 100 శాతం రికవరీ చేసిన వీధి వ్యాపారులకు క్రెడిట్ కార్డ్ సదుపాయం కల్పిస్తూ, గృహ అవసరాలకు మాత్రమే వినియోగించుకునేలా మొదటగా 10 వేల నుండి 30 వేల రూపాయల వరకు వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

## విద్యతో పాటు విలువలు నేర్పిన టీచర్ లక్ష్మీ

### - రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి

**రామకుప్పం,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులకు విలువలతో కూడిన నేర్పించడంతోపాటు వారిని బాధ్యతాయుత పౌరులుగా పెరగడానికి కృషిచేసిన లక్ష్మీ మేడం గారు పదవి విరమణ చేయడం బాధాకరమని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు లక్ష్మి పదవి విరమణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మునస్వామి మాట్లాడుతూలక్ష్మి మేడం క్లాస్ అంటే పాఠంతో పాటు జీవిత పాఠం కూడా నేర్చుకున్నట్టే అని, పేద విద్యార్థులకు సొంత ఖర్చుతో పుస్తకాలు, పెన్నులు కొనివ్వడం, ఆడపిల్లల చదువు ఆగిపోకుండా వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ఆమె ప్రత్యేకత. కోవిడ్ సమయంలో సైతం ఫోన్ ద్వారా పాఠాలు చెప్పి విద్యార్థులకు అండగా నిలిచారు.

**భావోద్వేగానికి గురైన లక్ష్మి**

సన్మానానికి సమాధానంగా లక్ష్మి గారు మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. “బడి నా మొదటి ఇల్లు. పిల్లలే నా కుటుంబం. 36 ఏళ్లు ఎలా గడిచాయో తెలియలేదు. నా విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, టీచర్లు, పోలీసులు అయ్యి సమాజంలో మంచి స్థానంలో ఉండటమే నాకు దక్కిన అసలైన సత్కారం” అన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా ఉచితంగా ట్యూషన్లు చెబుతానని, సామాజిక సేవలో పాల్గొంటానని ఆమె ప్రకటించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ నాగభూషణం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రన్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నారాయణప్ప స్థానిక ముఖ్య నేతలు ఎర్రప్ప హనుమంతు,పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పురాతనమైన అగస్త్రీశ్వరాలయం కొండపై భోజనశాల నిర్మాణం

**పుంగనూరు,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని నెక్కుంది పంచాయతీలో ప్రాచీన ఆలయమైన అగస్తీశ్వరస్వామి కొండపై భక్తులకు భోజనశాల నిర్మాణం పనులు సుమారు రూ.20లక్షల రూపాయలతో చేపట్టారు. ఈ భవన నిర్మాణానికి దాతలు నగదు, వస్తు రూపేణ విరాళాలు అందించాలని స్వామివారి భక్తబృందం కోరుతున్నారు. ఎత్తైన్న కొండల మధ్య వైఎస్సార్‌సిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిధున్‌రెడ్డిలు కలసి సుమారు రూ.7 కోట్లరూపాయలతో ఆలయం, పుష్కరిణి, కొండపై రోడ్డు , విద్యుత్ దీపాలు, ఫంక్షన్‌హాల్, విశ్రాంతి గదులు నిర్మించారు. ప్రస్తుతం అన్నదాన సత్రం నిర్మిస్తుండటంతో దాతలు విరాళాలు అందించాలని కోరుతున్నారు.

## కిల్లి రవి ఆత్మహత్య కేసులో మహిళ అరెస్ట్

**రేణిగుంట,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైల్వే ఉద్యోగి కిల్లి రవి ఆత్మహత్య కేసులో నిందితురాలు ఎస్. ఉషారాణి (35), తిరుపతి మంగళం నివాసిని రేణిగుంట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మృతుడి వద్ద లభించిన సూసైడ్ నోట్, పోస్టుమార్టం నివేదిక, సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా ఆమెను కరకంబాడి బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం చట్ట ప్రకారం నిందితురాలిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు.

# ‘ఉద్యమి’లను నాయకులుగా గుర్తించడమే లక్ష్యం

**- నేటి నుంచి పార్టీ నిర్మాణ సారధుల నుంచి దరఖాస్తులు స్వీకరణ**
**- ఉంగుటూరు ఎమ్మెల్యే, చిత్తూరు జిల్లా జేఎస్పీ పరిశీలకులు ధర్మరాజు వెల్లడి**



**చిత్తూరు, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల పక్షాన అనేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఉద్యమిలను పార్టీ నాయకులుగా గుర్తించడం కేవలం జనసేన పార్టీ ( జేఎస్పీ ) కే సాధ్యమవుతుందని ఏలూరు జిల్లా ఉంగుటూరు శాసనసభ్యులు, చిత్తూరు జిల్లా జనసేన పార్టీ పరిశీలకులు పి ధర్మరాజు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని చిత్తూరు నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన జేఎస్పి నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ప్రతినిధుల సమావేశానికి ఎమ్మెల్యే ధర్మరాజు హాజరయ్యారు. తొలుత 32 మంది కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి నిర్మాణ సారధుల సమాచారాన్ని ఎలా సేకరించాలి... దరఖాస్తులను ఎలా స్వీకరించాలనే అంశంపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తో కలిసి ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడారు. జనసేన పార్టీని నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంతో చిత్తూరు జిల్లాలో 32 మందితో నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. తమ పార్టీలో కులాలు, మతాలు, కుటుంబ నేపథ్యాలు, రక్తసంబంధాలతో నిమిత్తం లేకుండా పారదర్శకంగా పదవుల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సూచనలు, ఆదేశాల మేరకు ఎవరూ ఊహించని విధంగా పార్టీ పదవుల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే సోమవారం నుంచి 5 రోజుల పాటు చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల నుంచి పలు పదవులను ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. మొత్తం 7 నియోజకవర్గాలకు సంబంధించిన ఆయా దరఖాస్తులను చిత్తూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలోనే స్వీకరిస్తారని స్పష్టం చేశారు. గత 12 సంవత్సరాలుగా పార్టీకి చేసిన సేవలు, ఇతర ప్రత్యేక అర్హతలను పరిగణలోకి తీసుకొని పదవుల కేటాయింపు ఉంటుందన్నారు. పార్టీ పదవులు, లక్ష్యం, ఎంపిక మార్గదర్శకాలపై తాను నియోజకవర్గాల్లో పర్యటించి పార్టీ శ్రేణులకు అవగాహన కల్పిస్తామన్నారు. అందులో భాగంగా తొలి రోజైన సోమవారం సాయంత్రం పూతలపట్టు, చిత్తూరు నియోజక వర్గాలు, మంగళవారం ఉదయం 7 గంటలకు చంద్రగిరి, 8 గంటలకు నగరి 9.30 గంటలకు జీడీ నెల్లూరు, సాయంత్రం 4.30 గంటలకు కుప్పం, 6.30 గంటలకు పలమనేరు నియోజకవర్గాలలోని పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానన్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంటు, శాసనసభ, మండల, గ్రామస్థాయి పదవుల దరఖాస్తు విధానాన్ని తెలియజేస్తామన్నారు. పదవుల కేటాయింపులో తప్పకుండా సామాజిక న్యాయాన్ని పాటిస్తామని స్పష్టం చేశారు. ఔత్సాహిక నాయకులు, కార్యకర్తలు తమ బయోడేటాతో పాటు, గత 12 సంవత్సరాలుగా పార్టీకి తాము చేసిన సేవా కార్యక్రమాల నివేదికను దరఖాస్తుతో జతపరచి అందజేయాల్సి ఉంటుందని సూచించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తిరుపతికి చెందిన జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్ వ్యవహార తీరుపై మాట్లాడుతూ ... క్రమశిక్షణకు మారుపేరైన తమ పార్టీ అధినేత నిర్ణయమే అందరికీ శిరోధార్యమవుతుందని, ఇందులో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు ఉండబోవని తెలిపారు. కాకపోతే ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న తమ పార్టీలో కొన్ని లోపాలు జరుగుతున్నాయనడం వాస్తవమేనని .... వాటిని సరిచేసే పనిలో తమ అధినేత నిమగ్నమై ఉన్నారని తెలిపారు. కాగా ఈ సమావేశంలో జిల్లా జనసేన పార్టీ ముఖ్య నాయకులు కే పుష్ప, ఆరని కవిత, దేవినేని యశ్వంత్, లోచన్ శ్రీరామ్, రూప్ కుమార్ రాయల్ పూలప్రభాకర్, మాజీ కార్పొరేటర్ పూర్ణచంద్రరావు, శరవణ, రెడ్డిగుంట కిషోర్, మునిరత్నం, పెనుమూరు సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ‘కొమాకి’ ఎలక్ట్రిక్ బైక్స్ షోరూం ప్రారంభం



**చిత్తూరు,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలోని ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, అన్న క్యాంటీన్ ఎదురుగా వివిఎం ఎలక్ట్రిక్ ఆటోమొబైల్స్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన ‘ కొమాకి ‘ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయ షోరూమ్ సోమవారం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా వివిఎం ఎలక్ట్రిక్ ఆటోమొబైల్స్ సంస్థ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. తమ వద్ద పురుషులు, స్త్రీలనే తేడా లేకుండా ఇరువురికి నచ్చే, మెచ్చే ఎలక్ట్రికల్ స్కూటీలు, వ్యాపారస్తులకు బాగా ఉపయోగపడే ఎలక్ట్రిక్ లోడర్ ద్విచక్ర వాహనాలు లభిస్తాయని పేర్కొన్నారు. స్కూటీలలో పలు ఆకర్షణమైన రంగులతో ఏడు మోడల్స్, మరో ఐదు రకాల లోడర్ వాహనాలను విక్రయాలకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. గత 10 సంవత్సరాలుగా తిరుపతి నగరంలో, గత ఆరు సంవత్సరాలుగా పుంగనూరు పట్టణంలో తమ వివిఎం ఎలక్ట్రిక్ ఆటోమొబైల్స్ ద్వారా పెద్ద ఎత్తున కొమాకి ద్విచక్ర వాహనాలను విక్రయిస్తున్ననట్లు వెల్లడించారు. తమ వద్దనున్న కొమాకి స్కూటీ వాహనాలు మోడల్ ను బట్టి కేవలం రెండు యూనిట్ల విద్యుత్తు ఖర్చుతో 30 నుంచి 480 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తాయన్నారు. అదే క్రమంలో ఆయా మోడల్ లోడర్ వాహనాలు 250 నుంచి 500 కిలోల బరువును మోసుకెళ్ళే సామర్థ్యం ఉన్నాయన్నారు. తమ వివిఎం ఎలక్ట్రిక్ ఆటోమొబైల్స్ సంస్థ గ్యారేజిలో కొమాకి కంపెనీతో పాటు, ఇతర కంపెనీలకు చెందిన బ్యాటరీ ద్విచక్ర వాహనాల సర్వీస్ సౌకర్యం ఉందని, అదే క్రమంలో ఔత్సాహిక నిరుద్యోగ యువతకు ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిజంపై ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వినియోదారులు పాల్గొన్నారు.

## ‘బాస్’ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ జన్మదిన వేడుకలు



**చిత్తూరు, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బలిజ అభ్యుదయ సేవా సంఘం ( బాస్ ) జిల్లా కార్యదర్శి చిత్తూరు గిరింపేట దుర్గమ్మ ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ విశ్వనాథ్ జన్మదిన వేడుకలను సోమవారం ఉదయం చిత్తూరు నగరంలోని గాంధీ సర్కిల్ లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ క్రమంలో బాస్ ముఖ్య నాయకుడు, జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీ, బాస్ అధ్యక్షులు ఓఎం రామదాసు, చిత్తూరు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు కాజూరు రాజేష్, చిత్తూరు మున్సిపల్ మాజీ కార్పొరేటర్ పూర్ణచంద్రరావు సమక్షంలో విశ్వనాథ్ తన పుట్టినరోజు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు అనంతరం గాంధీ సర్కిల్, స్థానిక ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలోని పేదలు, రోగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బాస్ ప్రతినిధులు మాట్లాడుతూ బలిజ సంఘం బలోపేతానికి, చిత్తూరు నగరంలోని దుర్గమ్మ ఆలయ అభివృద్ధికి విశ్వనాథ్ ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు. ముఖ్యంగా జిల్లాలో బలిజ కులస్తులను ఏకం చేయడంలో విశ్వనాథ్ పాత్ర కీలకమన్నారు. కాగా ఈ కార్యక్రమంలో బాస్ ప్రతినిధులు కోలాకిరణ్, రెడ్డిగుంట కిషోర్, తులసీనాథ్, మునిరత్నం, గోపి తదితరులు పాల్గొన్నారు.

## వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించండి



**చిత్తూరు, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పీజీఆర్ఎస్ ) కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కమిషనర్ పి నరసింహప్రసాద్ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గతవారం అందిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి - 3 , రెవెన్యూ -2, ప్రజారోగ్య విభాగం -2, టిడ్కో -1 చొప్పున మొత్తం 8 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏసీపీలు నాగేంద్ర, సుభప్రధ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కుప్పం పీజీఆర్ఎస్‌కు 54 వినతులు

**కుప్పం, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం కడ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీ జీ ఆర్ ఎస్ కార్యక్రమంలో మొత్తం 54 వినతులు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించినవి అందాయి. ఇందులో రెవెన్యూ (సీసీఎల్ఏ) శాఖకు అత్యధికంగా 18 వినతులు నమోదయ్యాయి.తదుపరి స్థానాల్లో సర్వే, సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖకు 7, పెన్షన్లకు 7, పోలీసు శాఖకు 3, పి 4 విభాగానికి 4 వినతులు అందాయి. అలాగే ఆర్అండ్‌బీ, హౌసింగ్, మున్సిపాలిటీ, ఐసీడీఎస్, విద్యా శాఖలకు తలా 2 చొప్పున వినతులు నమోదు కాగా, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, సబ్ రిజిస్ట్రార్, పౌర సరఫరాల శాఖలకు తలా ఒక్కో వినతి అందింది. అదే సమయంలో స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు, ప్రజారోగ్యం, ఏపీ ఎస్పీడీసీఎల్, సాగునీటి శాఖ, భూసేకరణ, అటవీ శాఖలకు ఎలాంటి వినతులు నమోదు కాలేదు.ప్రజలు సమర్పించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు



**పలమనేరు , జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరులోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గృహానికి చేరుకున్న పలమనేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎన్. అమర్నాథ రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్థానిక నాయకులతో కలిసి అమర్నాథ్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారి స్వగృహంలోని శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి విగ్రహం వద్ద వారు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని వేడుకున్నారు. తదనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొని జిల్లా రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, జిల్లా చెందిన వసంత కుమార్, ఏఎంసీ చైర్మన్ రాజన్న,పలువురు సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



**పలమనేరు ,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా శివాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పౌర్ణమి సందర్భంగా శివాలయంలో భక్తులు కిటకిటలాడారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. ప్రసాదం దాతల పేర్లు సుబ్రహ్మణ్యం, పెద్దబ్బ, ఈ కార్యక్రమంలో శివాలయం చైర్మన్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ మంజునాథ్, డైరెక్టర్లు ఏం. టి.ఆర్ ప్రసాద్, సుజాత, బాబు, రెడ్డప్ప, వీరప్ప, మోహన ప్రియ, కోటి పాల్గొన్నారు.

## ఘనంగా సహకార స్వర్ణోత్సవాలు

**రామకుప్పం,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సహకార సమృద్ధికి ఐదు సంవత్సరాల స్వర్ణోత్సవాల సందర్భంగా రామకుప్పం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సింగల్ విండో చైర్మన్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఘనంగా స్వర్ణోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సింగల్ విండో డైరెక్టర్లు మరియు బ్యాంక్ బృందం సహకార సంఘం పరిధిలో చెట్లను నాటి, సహకార పతాకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తూ రైతులకు మరియు బ్యాంకు ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు సహకార సంఘం అభివృద్ధికి రైతులుతో పాటు బ్యాంకు ఖాతాదారులు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సురేష్ సహకార సంఘం సిబ్బంది డిసిసి బ్యాంక్ సిబ్బంది పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

## సర్‌పై ఎంఆర్ఓ, ఏఈఓ సమీక్ష

**పెద్దపంజాణి, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సర్ 2026 ప్రక్రియలో భాగంగా పెద్దపంజాణి మండలం నందుగల బూత్ లెవెల్ ఏజెంట్లు తో మరియు సూపర్వైజర్లతో తహసిల్దారు మరియు సహాయ ఎన్నికల అధికారి పెద్దపంజాణి వారి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించబడినది. సదరు సమావేశంలో సర్ ప్రక్రియలో ఓటర్ల నుండి ఎనుమరేషన్ ఫారాలను సేకరించే క్రమంలో బూత్ లెవెల్ అధికారులకు బిఎల్ఏలు సహకరించి నిర్దేశించిన సమయంలోపు ప్రతి ఓటర్ యొక్క ఎనుమరేషన్ ఫారం 2002 ఎస్ఐఆర్ డేటాతో నింపి ఫోటోను అతికించి బూత్ లెవల్ అధికారికి చేర్చాలని, అర్హులైన ప్రతి ఓటరు , ఓటర్ లిస్టులో ఉండాలి, అనర్హులైన ప్రతి ఓటరు ఓటర్ లిస్ట్ నుండి తొలగించబడాలి అని తెలియజేయడమైనది.

ఇందుకు ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ సంపూర్ణ సహకారం అందించాలని కోరడమైనది. ఈ సందర్భంగా పెద్దపంజాణి మండలం నందు గల ప్రతి ఓటరు మీరు తీసుకున్న ఎనుమరేషన్ ఫారంలలో రెండింటిలో ఒకటి మీ వద్ద ఉంచుకొని రెండవ ఫారం నందు వివరాలు నమోదు చేసి మీ యొక్క బూత్ లెవెల్ అధికారి కి చేర్చాలని కోరడమైనది.

## రైతులకు చెక్కులు పంపిణీ

**రామకుప్పం, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామకుప్పం మండలం బందార్లపల్లి సచివాలయంలో సోమవారం గౌరివిమాకుల పల్లి, బందార్లపల్లి నూతన సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు కుప్పం కడ ఏపీడి శ్రీనివాస వర్మ సుమారు రూ.20 కోట్ల పరిహార చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన భూములు ఇచ్చే రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామకుప్పం మండల అధ్యక్షులు వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, సింగల్ విండో చైర్మన్ మహమ్మద్ రఫీ, రెస్కో వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ కమిటీలు ఇన్చార్జ్ సిరివేలు గంగాధర్ (చిన్నా)

**పుంగనూరు ,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుంగనూరు జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా రాజంపేట పార్లమెంటు స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నూతన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు జనసేన పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ సిరివేలు గంగాధర్ (చిన్నా) తెలిపారు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాజంపేట పార్లమెంట్ కమిటీ అబ్జర్వర్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసులు (ఖఖ ) ఆధ్వర్యంలో ఈ కమిటీల ఏర్పాటు ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు.

చిన్నా రాయల్ మాట్లాడుతూ మరింత పార్టీ నిర్మాణమే మన తొలి ప్రాధాన్యత. రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలు, మండలా లు, గ్రామాల్లో పార్టీ కమిటీలు వేయడం జరుగుతోంది. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ఆసక్తి, అంకితభావం ఉన్న జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలి. అందుకు సంబంధించిన దరఖాస్తులు జనసేన పార్టీ పుంగనూ రు నియోజకవర్గ ఇన్చార్జ్ చిన్నా రాయల్ , పార్లమెంటు సమాచార సేకరణ కమిటీ సభ్యులు, గాజుల నరేష్, విరూపాక్షి, నాగభూషణం దగ్గర అందుబాటులో కలవు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతుల సమస్యలను పరిష్కరించాలి

**- జాయింట్ కలెక్టర్‌కు వినతి : మామిడి రైతు సంఘం**



**పలమనేరు , జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 2026వ సంవత్సరం ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల సమస్యలపై మామిడి రైతు సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మునీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మునీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.... చిత్తూరు జిల్లాలోని తోతాపూరి మామిడి కి సంబంధించి ప్రభుత్వం దగ్గర రిజిస్టర్ అయిన ర్యాంపులు గతవారం కేజీకి రూపాయలు 4 ఇచ్చారని తెలిపారు.గత మూడు రోజులుగా తోతాపురి మామిడికి జిల్లాలో ఉన్న అన్ని రాంపుల వద్ద కేజీ 3 రూపాయలు మాత్రమే ఇస్తున్నారనిజిల్లాలోని రాంపులపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో జిల్లాలోని 40.వేల మంది మామిడి రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారని అన్నారు. ప్రభుత్వం 2026 సంవత్సరం మామిడి ధర కేజీకి సంబంధించి 7.50 పైసలుగా ప్రకటించారు. కానీ ప్రభుత్వం ప్రకటించిన ధర జిల్లాలోని ఏ ఒక్క గుజ్జు ఫ్యాక్టరీ కూడా అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 25 వ తారీకు వరకు తోతాపురి కేజీకి 6 రూపాయలు ధరతో గుజ్జు ఫ్యాక్టరీలలో ధర పట్టికలు పెట్టారు. అయితే గత మూడు రోజులుగా కేజీకి 6/- రూపాయలు ఉన్న ధర పట్టికను తీసివేసి చాలా ఫ్యాక్టరీలు 5 రూపాయలు ధరతో బోర్డులు పెట్టడం జరిగింది.దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి చర్యలు లేకపోవడం బాధాకరమని అన్నారు.జిల్లా స్థాయి అధికారులతో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని గతంలోని డిమాండ్ చేయడం జరిగిందన్నారు.కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు.ఇకనైనా ప్రభుత్వం స్పందించి పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు.గుజ్జు పరిశ్రమలు గత సంవత్సరం మామిడి రైతులకు ఇంకా ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే ఇచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. మామిడి రైతులకు ప్రత్యేక మ్యాంగో బోర్డును కూడా వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు.పకృతి వైపరీత్యాల కారణంగా ప్రతి ఏటా నష్టపోతున్న మామిడి రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.మామిడి పంటను కూడా పంటల బీమా పథకంలో చేర్చి పంటల భీమా వర్తింపజేయాలని అన్నారు.రాంపుల ఏర్పాటుకు అనుమతించిన ప్రభుత్వం గుజ్జు ఫ్యాక్టరీలలో ఇచ్చే రేటు రాంపులలో కూడా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధర అమలు చేయని రాంపులు, గుజ్జు ఫ్యాక్టరీలు పై చర్యలు తీసుకొని జిల్లాలోని 40వేలు మందికి పైగా మామిడి రైతుల సమస్యలపై మా డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో జిల్లాలో ఉన్న మామిడి రైతులతో పెద్ద ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఉమాపతి నాయుడు. మునిరత్నం నాయుడు. హేమలత. చంగల్రాయిరెడ్డి.జయ దేవయ్యతోపాటు.తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 30తో పిఆర్సీ గడువు పూర్తి అయి మూడేళ్లు ఇంతవరకు నో ఐ.ఆర్, నో పి.అర్.సి

**పలమనేరు,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 11వ పి.ఆర్ .సీ గడువు పూర్తి అయి జూన్ 30 కి మూడేళ్లు పూర్తయిన ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఐ.ఆర్(మధ్యంతర భృతి ) ప్రకటించడం కాని పి అర్ సి కమిషన్ నియమించకపోవడం కానీ దారుణమని వైఎస్ఆర్ సిపి ఉపాధ్యాయ విభాగం చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎన్ సోమచంద్రారెడ్డి విమర్శించారు. పలమనేరులో సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... గత పిఆర్సి 1.07.2018 పూర్తి అయితే వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జులై 2019 నుండి 27 శాతం మధ్యంతర భృతి చెల్లించిందన్నారు .పి ఆర్ సి కమిషన్ను నియమించి 01.01.2022 నుండి పి ఆర్ సి అమలు చేసిందన్నారు. 2020 , 2021లో ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా పరిస్థితుల్లో కూడా పి ఆర్ సి అమలు చేయడంలో వెనకడుగు వేయలేదన్నారు. కరోనాకాలంలో పదవీ విరమణ చెందిన ఉద్యోగులకు రావలసిన గ్రాట్యుయిటీ, కమ్యుటేషన్ కూడా ఎప్పటికప్పుడు విడుదల చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాలపాటు గ్రాట్యువయిటీ పెండింగ్ లో ఉంచి మార్చి 2026లో చెల్లించిందన్నారు. అప్పటి నుండి రిటైర్ అయిన వారికి మళ్ళీ పెండింగ్లో పెట్టారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల నాయకత్వం కూడా కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారు. తప్ప ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం లేదన్నారు. దీనివలన ఉద్యోగులు పెన్షనర్లు తీవ్రమైన ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పి ఆర్ సి కమిషన్ను నియమించడంతోపాటు ఐ ఆర్ ప్రకటించి పెండింగ్లో ఉన్న నాలుగు విడతల కరువు భత్యంలో కనీసం వెంటనే రెండు విడతలు డీఏ చెల్లించాలని డిమాండ్ చేశారు.

## సాయి శ్రీ చైతన్య విద్యార్థుల అద్భుత ప్రతిభ




**పలమనేరు,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ సమీపంలోని సాయినగర్ లో గల సాయి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా మండలి ఆధ్వర్యంలో కడపజిల్లా పులివెందులలో జరిగిన క్రీడోత్సవాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారని, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మిసుధ, కరస్పాండెంట్ ఎం .వి ఆర్ రెడ్డి తెలిపారు. పులివెందులలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో అండర్ 19 విభాగంలో కబడ్డీ నందు బాలురు, బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాదించారు. వాలీ బాల్ నందు బాలురు మొదటి స్థానం, బాలికలు విభాగంలో రెండవస్థానాన్ని సాధించారు. కోకో పోటీలలో బాలురు, బాలికల ఇరువురూ ద్వితీయ స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థుల జట్లు జూలై చివరి వారంలో జమ్మూ కాశ్మీర్ నందు జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ ఎం.వి.ఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీ సుధ ఫిజికల్ డైరెక్టర్లు లోకేష్, జి.వినోద్ కుమార్, అధ్యాపక బృందం అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలి

**- అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**

**మదనపల్లె, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అర్జీల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అధికారులను ఆదేశించారు.సోమవారం మదనపల్లె నందు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.వృద్ధులు, మహిళలు మరియు దివ్యాంగుల నుంచి వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్లలోనే నిర్భయంగా ఫిర్యాదులు సమర్పించవచ్చని స్పష్టం చేశారు.స్థానికంగా అందే ఫిర్యాదులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరంగా త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

**- వల్లిగట్ల వెంకటరమణ**

**వాల్మీకిపురం, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలోని పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫామ్ దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ హాజరై విద్యార్థులకు యూనిఫామ్ దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేందుకు అందరూ సహకరించాలని, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి విద్యతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న విద్యా సామగ్రి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుం దని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రామకృష్ణ, ఉపాధ్యాయ బృందం, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కాసం ఫ్యాషన్ షోరూం ప్రారంభం

**- ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి**



**పీలేరు, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు పట్టణంలోని కడప రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కాసం ఫ్యాషన్ షోరూమ్ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై షాపును ప్రారంభించారు.ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి రాగానే షాపు నిర్వాహకులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పీలేరు పట్టణం రోజురోజుకూ వ్యాపారపరంగా అభివృద్ధి చెందడం సంతోషకరం. కాసం ఫ్యాషన్ లాంటి నూతన షోరూం రావడం వల్ల స్థానిక ప్రజలకు అన్ని రకాల వస్త్రాలు ఒకేచోట లభిస్తాయి. పట్టణ ప్రజలు పక్క ఊళ్లకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే నాణ్యమైన బట్టలు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. వ్యాపారం చేసే ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి. కాసం ఫ్యాషన్ నిర్వాహకులకు నా శుభాకాంక్షలు. ఈ షాపు మరింత అభివృద్ధి చెంది, వినియోగదారుల మన్ననలు పొందాలని, లక్ష్మీ కటాక్షం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక వర్తక సంఘం నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

# 22-ఎ భూములకు చెక్

**- పెండింగ్ భూ వివాదాలకు పరిష్కారం - పత్రాల పంపిణీ**

**- రైతులకు, ప్రజలకు పారదర్శక సేవలే లక్ష్యం- జాయింట్ కలెక్టర్**



**మదనపల్లె, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 22-ఎ భూ సమస్యలకు జిల్లా యంత్రాంగం వేగంగా పరిష్కారం చూపుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగా మదనపల్లె, రాయచోటి, పీలేరు సబ్ డివిజన్ల పరిధిలో ఏళ్లుగా పరిష్కారం కాని 22-ఎ సంబంధిత 9మంది రైతులకు సంబంధించిన 29.26ఎకరాలు భూ సమస్యలను పరిష్కరించినట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ తెలిపారు.సోమవారం మదనపల్లె కలెక్టరేట్లో భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... ఆయా డివిజన్ల పరిధిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత పాత రికార్డులు, దస్త్రాలను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించామని తెలిపారు. ముఖ్యంగా ఐదు నుంచి ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. 22-ఎ భూ సమస్యలు పరిష్కరించిన 9 మంది రైతులకు, ప్రజలకు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి తో కలిసి జాయింట్ కలెక్టర్ పత్రాలను అందజేశారు. గత అనేక సంవత్సరాలుగా సర్వే నంబర్ సవరణలు, కొత్త సర్వే నంబర్ల చేర్పులు, అడంగల్ వివరాల సరిదిద్దడం వంటి సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు ఈ చర్యల ద్వారా ఊరట లభించింది.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది , లబ్ధిదారులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ముగింపు పోటీలు

**వాల్మీకిపురం, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వాల్మీకిపురం పట్టణంలోని సిడిసిఎ- జీవీఎస్సిఎస్ క్రికెట్ గ్రౌండ్స్ వేదికగా జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం (జూన్ 30)తో ముగింపు దశకు చేరుకోనుంది. టోర్నమెంట్‌లో చివరి మ్యాచ్‌లు మంగళవారం ఉదయం 9 గంటలకు రెండు వేదికలపై ఏకకాలంలో ప్రారంభం కానున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) హెడ్ కోచ్ సునీల్ కుమార్ తెలిపారు.గ్రౌండ్ - ఏలో చిత్తూరు జిల్లా జట్టు మరియు కడప జిల్లా జట్టు మధ్య పోటీ జరగనుండగా, గ్రౌండ్ - బిలో అనంతపురం జిల్లా జట్టు మరియు నెల్లూరు జిల్లా జట్టు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లు టోర్నమెంట్‌లో అత్యంత కీలకమైన చివరి పోటీలు కావడంతో ఉత్కంఠభరితమైన పోరును క్రీడాభిమానులు ఆస్వాదించే అవకాశం ఉందన్నారు.ఈ సందర్భంగా హెడ్ కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని క్రికెట్ క్రీడాకారులు, క్రీడా ప్రేమికులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై మ్యాచ్‌లను వీక్షించి క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ టోర్నమెంట్ ద్వారా యువ క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తోందని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు అర్హులైన క్రీడాకారులను తీర్చిదిద్దే దిశగా ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

## బీవైఎస్ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రి పంపిణీ

**- ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి**



**మదనపల్లె, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమ్మచెరువు మిట్ట నందు గల మున్సిపల్ హైస్కూల్ లో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థు లకు బహుజన యువసేన ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా నోట్ బుక్స్, పెన్నులు,పెన్సిల్స్ పంపిణీ చేశారు.బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ప్రభాకర్ రెడ్డి,విశిష్ట అతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు విచ్చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తూ బహుజన యువసేన ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.అనంతరం హెచ్ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు ఈ వస్తువులను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు.బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతోనే మా సంస్థ తరఫున ఈ చిన్న సహాయం అందిస్తున్నామని,ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని,అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు,ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.రాబోయే రోజుల్లో మరిన్ని పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,బహుజన యువసేన ప్రతినిధులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కంచి సూరిని పరామర్శించిన ఎమ్మెల్యే

**పీలేరు,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ పీలేరు పట్టణ అధ్యక్షులు దలవాయి సురేష్ కుమార్ రెడ్డి ఏ కంచి సూరి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు.సోమవారం పీలేరు పట్టణం ఇందిరమ్మ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లిన పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కంచి సూరిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సూరి పార్టీకి సీనియర్ నాయకులు. పట్టణ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలోకి రావాలని కోరుకుంటున్నానని సూచించారు. పీలేరు పట్టణంలోని యలమంద క్రాస్ కావలి పల్లికి చెందిన టిడిపి నాయకులు అనీఫ్ సతీమణి షకీలా అనారోగ్యంతో ఉండడంతో ఆమెను పరామర్శించి ఆమె ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యుల్ని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కంచి సూరి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## నాణ్యతే ప్రామాణికంగా పిజిఆర్ఎస్ సమస్యలను పరిష్కరించాలి : జేసి



**మదనపల్లె, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాణ్యతే ప్రామాణికంగా... పిజిఆర్ఎస్ సమస్యలను పరిష్కరించి ప్రజలకు భరోసా కల్పించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీతోపాటు సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ.... పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మొత్తం 332 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దేవదాయ భూముల అన్యాక్రాంతంపై కలెక్టర్‌కు ఫిర్యాదు




**మదనపల్లె, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా,మదనపల్లె నియోజకవర్గం, నిమ్మనపల్లె మండలం,ముష్టూరు పంచాయతీ పరిధిలోని దేవదాయ శాఖకు చెందిన భూములు ఆక్రమణకు అవుతున్నాయంటూ దామోదర్,లక్ష్మీనారాయణ,రెడ్డి మోహన్,రామ,శంకర్ లు సోమవారం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవదాయ శాఖకు చెందిన భూముల్లో కొందరు అక్రమంగా సాగుచేస్తున్నారని ఆరోపించారు. దీంతో దేవాలయాలకు రావలసిన ఆదాయానికి గండిపడుతోందని అన్నారు. ప్రస్తుతం ఈ భూముల విలువ కోట్ల రూపాయలు ఉందని తెలిపారు.పాలేటమ్మ దేవస్థానం,నేల మల్లేశ్వరస్వామి ఆలయం,చెన్నకేశవస్వామి ఆలయం,సోమేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించి ముస్తూరు గ్రామపంచాయతీ లోని 585,615,542/5,542/2,675,731 , 866/బి,868/2,1041,866-ఎ2,869/1,184,361 సర్వే నెంబర్ల లో భూములు కలిగి ఉన్నాయన్నారు. ఈ విషయమై గతంలో దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సర్వే నిర్వహించి ఆక్రమణలకు గురి అయిన దేవాదాయ భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని కోరారు. అలాగే ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## జనసేన పార్టీ కమిటీల ఏర్పాటు

**రాజంపేట పార్లమెంటు నుంచి గ్రామస్థాయి వరకు నూతన కమిటీలు: పవన్ ఆదేశాలతో కసరత్తు**

**పీలేరు, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా రాజంపేట పార్లమెంటు స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నూతన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు జనసేన పార్టీ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ బెజవాడ దినేష్ తెలిపారు.ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కమిటీల ఏర్పాటు ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు.బెజవాడ దినేష్ మాట్లాడుతూ: "పార్టీ నిర్మాణమే మన తొలి ప్రాధాన్యత. రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల్లో పార్టీ కమిటీలు వేయడం జరుగుతోంది. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ఆసక్తి, అంకితభావం ఉన్న జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.""కమిటీల్లో పనిచేయడానికి ఆసక్తి ఉన్నవారు తమ పూర్తి వివరాలతో కూడిన సమ్మతి పత్రాలను రాజంపేటలోని పార్లమెంటు సెంట్రల్ ఆఫీస్‌లో వెంటనే సమర్పించాలి. పవన్ కళ్యాణ్ గారి ఆశయ సాధనకు, కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిబద్ధతతో పనిచేసే వారికి కమిటీల్లో తప్పకుండా ప్రాధాన్యత ఉంటుందని పిలుపునిచ్చారు.జనసైనికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు.అందుకు సంబంధించిన దరఖాస్తులు జనసేన పార్టీ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ బెజవాడ దినేష్, పార్లమెంటు సమాచార సేకరణ కమిటీ సభ్యులు, కలప రవి, దీపాని ప్రభాకర్, పోలి మేర రెడ్డప్ప దగ్గర అందుబాటులో కలవు.ఈ కార్యక్రమంలో కలప రవి, దీపాని ప్రభాకర్, పొలిమేర రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి



**వాల్మీకిపురం,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామంలో రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రతీకగా భావించే ఏరువాక పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాంప్రదాయ పద్ధతిలో భూమాతకు, వ్యవసాయ పరికరాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రానున్న వ్యవసాయ సీజన్‌లో సమృద్ధిగా పంటలు పండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురవ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతే దేశానికి వెన్నెముక అని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా వ్యవసాయ అధికారి శివ నారాయణ రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అనుసరించాల్సిన సాగు విధానాలు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, ఎరువుల సమతుల్య వినియోగం, పంటల సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి, టీడీపీ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, దామోదర్ రెడ్డి, శేషు, వ్యవసాయ అధికారి (ఏవో) మురళి, వ్యవసాయ శాఖ అధికారి హేమలతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగగా, రైతులు సంప్రదాయాలను కొనసాగిస్తూ ఏరువాక పౌర్ణమి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.

# విద్యతోనే బంగారు భవిష్యత్తు

**- మంత్రి లోకేష్ సారథ్యంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు-ఎమ్మెల్యే కిషోర్**

**- విద్యార్థులకు విద్య పేదరికం అనే సంకెళ్ళను తెంచే ఆయుధం కావాలి : ఎమ్మెల్యే**



**పీలేరు ,జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దార్శనికతతో రాష్ట్రంలో విద్యారంగం స్వర్ణయుగంలోకి అడుగుపెడుతోందని పాఠశాలల రూపురేఖలు మార్చి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్న యువ నాయకుడు లోకేష్ అని ఎమ్మెల్యే కొనియాడారు.అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణం చిత్తూరు రోడ్డు మార్గంలో ఉన్న జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనడంతో పాఠశాల సిబ్బంది విద్యార్థినీలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్య ఒక్కటే పేదరికాన్ని జయించే ఆయుధం. ముఖ్యంగా ఆడపిల్లలు చదువుకుంటే ఆ కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది. మీరంతా బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని. నాణ్యమైన పుస్తకాలు, యూనిఫాంలు ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచుతున్నాం. చదువుకు దూరం కావద్దని సూచించారు.చదువు అంటే కేవలం పుస్తకాలు చదవడం పరీక్షలు రాయడం కాదు మనిషి ఆలోచనకు పదును పెట్టి, మంచి చెడు లను విచక్షణతో చూడగలిగే శక్తినిచ్చేదే నిజమైన విద్య అని అన్నారు.విద్య విద్యార్థులకు అజ్ఞానం, మూఢనమ్మకాలు, పేదరికం అనే సంకెళ్లను తెంచే ఆయుధం, చీకటిని పారద్రోలే దీపంగా మారాలని, ఉపాధ్యాయులు కేవలం విద్యా జ్ఞానం ఇవ్వడమే కాదు దారి చూపే దార్శనికుడు, మార్గం చూపే మార్గదర్శక మారాలని అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లల్లో ఉన్న ప్రత్యేకతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.ఈ గురుకులం నుంచి చదువుకుని కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు గా తయారు కావాలని అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. మీ కలలు నిజం చేయడమే మా బాధ్యతని అన్నారు. అనంతరం బాలికలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.పాఠశాల అద్దె భవనంలో నడుపుతున్నట్లు ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ స్థలంలో నిర్మాణం కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు.బాలికలకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం కిట్లను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చేతులు మీదుగా అందజేశారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



**జగ్గంపేట జూన్29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధర ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. రైతులతో కలిసి సంప్రదాయ పద్ధతిలో పూజలు చేసి, నాగలితో దుక్కి దున్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అనుసరించాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి మండిపల్లి



**రాయచోటి జూన్29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం గొల్లముదివీడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎట్టకేలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పాఠశాలలో సుమారు 280 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఎక్కువ మంది రాయచోటి పట్టణం నుంచే వస్తుంటారు. పాఠశాల వేళలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇటీవల విద్యార్థులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి పాఠశాల వరకు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి విద్యార్థులు ఉపాధ్యాయులకు అనుగుణంగా వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం రాయచోటి నుంచి గొర్లముదివీడు గ్రామం వరకు బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. బస్సు గ్రామంలోకి చేరుకోగానే గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని స్వాగతం పలికారు. బస్సు సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే



**వీరఘట్టం జూన్29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. వీరఘట్ట మండలం ఎం.రాజపురం గ్రామంలో సోమవారం ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాలో జమచేస్తున్నారని తెలిపారు. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు పంట మార్పిడి విధానం అవలంబించాలని సూచించారు. వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని, కేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ రత్నకుమారి, ఏవో సౌజన్య, నాయకులు పొదిలాప కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రైతు రాజైతే.. రాజ్యం సుభిక్షమవుతుంది

- రాష్ట్రంలో వ్యవసాయ రంగ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం
- రూ.58 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్ దేశానికే ఆదర్శం
- వీలైనంత త్వరగా పోలవరం పూర్తి చేసి రైతాంగానికి అంకితమిస్తాం
- ఏరువాక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర.



**మచిలీపట్నం జూన్29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రంలో రైతాంగం సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం రూరల్ మండలం బుద్దాలపాలెంలో నిర్వహించిన ఏరువాక కార్యక్రమం లో పాల్గొన్నారు. రైతులతో కలిసి భూదేవికి పూజలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. రైతులకు ఎరువులు, విత్తనాల బస్తాలను పంపిణీ చేశారు. బుద్దాలపాలెంకు రోడ్డు మంజూరైంది. త్వరలోనే పూర్తి చేస్తాం. మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటికీ కుళాయి అందుబాటులోకి తీసుకొస్తాం. మౌలిక సదుపాయాలు కల్పించి తీరుతాం. బందరు పోర్టు వీలైనంత త్వరగా పూర్తి చేసి.. స్థానికంగా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతుని, వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రైతాంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.58 వేల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టాం. వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కూడా చంద్రబాబు నాయుడిదే. రైతులకు వ్యవసాయంలో అండగా నిలిచేందుకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఏ సీజన్లో ఎలాంటి పంటలు వేస్తే లాభసాటిగా ఉంటుందో వ్యవసాయ అధికారులతో సలహాలు సూచనలు అందిస్తున్నాం. నీటి సంఘాలను ఏర్పాటు చేసి.. సాగునీటి కాలువలన్నీ బాగు చేసుకున్నాం. బందరు నియోజకవర్గంలోని రూ.3 కోట్లతో సాగునీటి కాలువలను అభివృద్ధి చేశాం. ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేశాం. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందిస్తున్నాం. గతంలో పండిన పంటను అమ్ముకునే దిక్కులేదు. డబ్బులు ఎప్పుడొస్తాయో తెలియదు. కానీ నేడు పంట అమ్ముకున్న 24 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. సాగునీటికి ఇబ్బందులు లేకుండా పట్టిసీమ నిర్మాణంతో కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేశాం. పొరుగు రాష్ట్రం ప్రయోజనాల కోసం జగన్ రెడ్డి పోలవరం ప్రాజెక్టును పాడుబెట్టాలని ప్రయత్నిస్తే.. కూటమి వచ్చిన వెంటనే పోలవరం ప్రాజెక్టు పనులు వేగం పెంచాం. వచ్చే ఏడాది నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తాం. గ్రావిటీ ద్వారా సాగునీరు అందిస్తాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. 63 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. రెండేళ్లలో రూ.65 వేల కోట్లు అందించాం. ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం అందిస్తున్నాం. జులై 15న తల్లికి వందనం అమలు చేయబోతున్నాం. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తున్నాం. గతంలో కేంద్రం ఇచ్చే సొమ్ము మాత్రమే రైతుల ఖాతాల్లో వేసి ఉద్ధరించినట్లు చెప్పుకున్నారు. కానీ మనం కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రూ.14 వేలు చేర్చి రూ.20 వేల చొప్పున అందిస్తున్నాం. ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. గతంలో రోడ్లు అన్నీ గుంతలమయం అయితే.. నేడు గుంతలు లేని రోడ్లు సాకారం చేసి చూపించాం. సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తున్నాం. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. అమరావతి, పోలవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పరిశ్రమలు పెట్టుబడులతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న మంచి చూసి ఓర్వలేక జగన్ రెడ్డి రోజుకో కుట్రకు తెరలేపుతున్నాడు. ఈ మధ్య విజయవాడలో ఒక సంఘటన జరిగితే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ నుండి రాగానే బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఘటనపై పూర్తి విచారణ జరిపించేందుకు సిట్ వేశారు. సీఐని సస్పెండ్ చేశారు. ఆ ఘటనకు కులం అంటగడుతున్నారు. ఆడబిడ్డలపై దాడి చేసిన వాడికి కులం ఏంటి? హత్యలు చేసిన వాడికి కులం ఏంటి? కులం మతం ప్రాంతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నించే వైసీపీ నాయకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. మొన్నటి వరకు అమరావతి వద్దు మూడు రాజధానులు కావాలన్నారు. ఇప్పుడు అమరావతిని ఉద్ధరిస్తామంటూ రాజకీయం చేయాలని ప్రయత్నిస్తే.. రైతులంతా తిరగబడి పరిగెత్తించి మరీ కొట్టారు. బందరు నుండి ఒక వ్యక్తి ఎగేసుకు వెళ్లి ప్రజలతో చీవాట్లు తిని వచ్చాడు. జగన్ రెడ్డి లాంటి దుర్మార్గుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మనం ఇటుక ఇటుక పేర్చి నిర్మాణం చేస్తుంటే.. జగన్ రెడ్డి లాంటి వాళ్లు వచ్చి కూలగొడుతున్నారు. ఒకే ప్రభుత్వం పాతికేళ్లు నిలకడగా ఉండాలి. అప్పుడే మనం అభివృద్ధిని సాధించగలుగుతాం. గతంలో గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కొనసాగడంతోనే అభివృద్ధి శాశ్వతంగా నిలిచింది. అదే స్ఫూర్తి ఇక్కడా చూపిస్తే.. ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపి చూపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# బీచ్‌కు పర్యాటక శోభ తెచ్చేలా వినాయక చవితి వేడుకలు నిర్వహిద్దాం.

- అన్ని రకాల సదుపాయాలు కల్పించి బందరుకు నూతన శోభ తీసుకొద్దాం.
- ప్రజలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్దాం.
- అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర.

**మచిలీపట్నం జూన్29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :.** బందరు చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పడంతో పాటుగా, మంగినపూడి బీచ్‌కు పర్యాటక శోభ తెచ్చేలా వినాయక చవితి వేడుకలు మంగినపూడి బీచ్ వద్ద నిర్వహిద్దామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు మచిలీపట్నం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ ఇతర పుర ప్రముఖులతో కలిసి స్కూల్ అసోసియేషన్, కాలేజ్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, జ్యూవెలర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిదులు, థియేటర్స్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, గోల్డ్ కవరింగ్ అసోసియేషన్, ఎలక్ట్రీషియన్ అసోసియేషన్, బార్ అసోషియేషన్ ప్రతినిధులు, విశ్వహిందు పరిషత్ ప్రతినిధులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగినపూడి బీచ్ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాలకు సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా మంగినపూడి బీచ్ వద్ద 63 అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో తిరుమల, శ్రీశైలం, కాణిపాకం, ఇంద్రకీలాద్రి, సింహాచలం, అయోధ్య దేవాలయాల నమూనా ఆలయాలు



కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నామన్నారు. అదే సమయంలో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత యువతకు నవరాత్రుల సమయంలో ఉపాధి కల్పించే అవకాశం లభిస్తుంది. ఇప్పటికే మంగినపూడి బీచ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశాం. ఆ మేరకు ఈ ప్రాంతంలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. ప్రధానంగా వసతుల లేమితో పర్యాటకులు స్థానికంగా ఉండడానికి ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ఏపీఎండీసీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు, కాఫీ కేఫ్ ఏర్పాటు చేస్తున్నాం. మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను కూడా కాఫీ కేఫ్ నిర్వాహకులకే అప్పగిస్తున్నాం. బీచ్ అభివృద్ధి కోసం మసులా బేపార్క్ కమిటీ కూడా ఏర్పాటు చేశాం. మరింత స్థలం అభివృద్ధి చేసి పర్యాటకులకు అన్ని రకాల వసతులు కల్పించాలి. గతంలో మసులా బీచ్ ఫెస్ట్ నిర్వహించాం. ఇప్పుడు వినాయక చవితి నిర్వహణతో ఈ ప్రాంతం రాష్ట్రం మొత్తాన్ని ఆకర్షించేలా చేద్దాం. ఈ మహా కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని రవీంద్ర సూచించారు.

# ప్రజా ఫిర్యాదులపై సత్వర చర్యలే ప్రాధాన్యం

**జిల్లా ఎస్పీ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 61 ఫిర్యాదులు స్వీకరణ**





**శ్రీకాకుళం, జూన్29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :.** ప్రజా ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమంలో అందిన ప్రజా ఫిర్యాదులపై సత్వర చర్యలే ప్రాధాన్యంగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ , పరిష్కారం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా ఎస్పీ మొత్తం 61 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి, తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో పౌర సంబంధిత వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆస్తి వివాదాలు, మోసపూరిత ఘటనలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 61 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు.

# ఖరీఫ్ సీజన్ కు సిద్ధంగా ఉండండి



**ధర్మవరం జూన్29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :.** తాడిమర్రి వ్యవసాయ శాఖ అధికారి శేఖర్ నాయక్, రాబోయే ఖరీఫ్ సీజన్ కు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. సోమవారం తాడిమర్రి మండల కేంద్రంలో రైతు సేవ కేంద్రం సిబ్బందితో జరిగిన సమావేశంలో, రైతులకు వ్యవసాయ సంక్షేమ పథకాలు, సబ్సిడీ ఎరువులు, విత్తనాల గురించి వివరించారు. ఈ పథకాలను రైతులకు సకాలంలో అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

# ఏడుగురు అక్కమ్మ గార్లను దర్శించిన మాజీ ఎమ్మెల్సీ



**మడకశిర జూన్29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :.** మడకశిర పట్టణం ఒకటో వార్డు శివపురంలో వెలసిన ఏడుగురు అక్కమ్మ గార్లను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సోమవారం ప్రత్యేకంగా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ పెద్దలు, అర్చకులు గుండుమల తిప్పేస్వామికి ఘన స్వాగతం పలికారు

# కిసాన్ ఛాయిస్ బెస్ట్ డీలర్ అవార్డు అందుకుంటున్న అట్లూరి





**గన్నవరం, జూన్ 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రముఖ వ్యవసాయ యంత్రాలు, వ్యవసాయ పనిముట్ల తయారీ సంస్థ మహాలక్ష్మి ఇండస్ట్రీస్ (కిసాన్ ఛాయిస్) నుండి హనుమాన్ జంక్షన్ అన్నపూర్ణ ఎంటర్ ప్రైజెస్ యజమాని అట్లూరి రాజశేఖర్ బెస్ట్ డీలర్ అవార్డు అందుకున్నారు. కిసాన్ ఛాయిస్ డీలర్స్ సమావేశం మంగళగిరిలోని సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మహాలక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత బిట్ర రఘు ప్రసాద్ రైతుల సేవలో ఉత్తమ ప్రతిభ కనపరచిన పలువురు డీలర్లను సన్మానించారు. ఈ సందర్భంగా అట్లూరికి జ్ఞాపికతో సత్కరించి ఉత్తమ డీలర్ అవార్డు అందచేశారు. ఈ సందర్భంగా రఘు ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు తక్కువ ధరకు నాణ్యమైన వ్యవసాయ యంత్రాలను అందించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. తమ సంస్థపై రైతులకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషిచేస్తున్నామని చెప్పారు. రైతులు బాగుంటేనే సమాజం బాగుంటుందన్న నమ్మకంతో తమ సంస్థ ఎన్నో ఏళ్ళుగా రైతులకు అవసరమైన యాంత్రిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని తెలిపారు. తమ సంస్థను, డీలర్లను ఆదరిస్తున్న రైతులకు ధన్యవాదములు తెలిపారు. హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా తక్కువ ధరకు నాణ్యమైన స్ప్రేయర్లు, వ్యవసాయ యంత్రాలు విక్రయిస్తూ రైతుల ఆధారాభిమానాలను పొందిన రాజశేఖర్ ను ఈ సందర్భంగా పలువురు అభినదించారు. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుండి డీలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మచిలీపట్నం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం



**మచిలీపట్నం జూన్29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రజా సమస్యలను పరిష్కరించే వేదికగా 'మీకోసం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బాలాజీ తెలిపారు. సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఆయన, అధికారులు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అవిన్ కూడా పాల్గొన్నారు.




# ఇరుముడికి పొంచి ఉన్న రెండు ముప్పులు



మాస్ మహారాజా రవితేజ హీరోగా రూపొందుతున్న ఇరుముడి ఆగస్ట్ 21 విడుదలకు రెడీ అవుతోంది. ఇప్పటికే ఒక టీజర్ రూపంలో కథ ఎలా ఉండబోతోందనే ఐడియా ఇచ్చేశారు. తాజాగా విడుదల చేసిన ఇరుముడి కట్టు పాట అయ్యప్ప స్వామి భక్తులను ఆకట్టుకునే విధంగా సంగీత దర్శకుడు జివి ప్రకాష్ కుమార్ కంపోజ్ చేయడం అంచనాలు పెంచేందుకు దోహదపడుతోంది. నల్లని దుస్తుల్లో రవితేజ చైల్డ్ ఆర్టిస్టుతో వేస్తున్న స్టెప్పులు చాలా హుషారుగా మళ్ళీ చూసేలా ఉన్నాయి. ఇక్కడితో అయిపోలేదు. నెక్స్ట్ రావాల్సిన మల్లెపూల పల్లకి పాట మీద అంచనాలు ఓ స్థాయిలో ఉన్నాయి. హక్కులు కొని మరీ దీన్ని ఇరుముడి కోసం వాడుతున్నారు. తండ్రి కూతురు సెంటిమెంట్ బలంగా ఉన్న ఈ సినిమాలో ఆ అంశం కన్నా అయ్యప్ప భక్తి ఎలిమెంట్ నే ఎక్కువగా హైలైట్ చేయడం ద్వారా ఫ్యామిలీ ప్రేక్షకులను లక్ష్యంగా పెట్టుకున్న వైనం స్పష్టంగా అర్థమవుతోంది. హీరోయిన్ ప్రియా భవాని శంకర్ ని పెద్దగా చూపించి చూపించకపోవడానికి కారణం ఇదేనేమో. దర్శకుడు శివ నిర్వాణ ఈ ఇరుముడి కోసం బాగా కష్టపడుతున్నారు. మజిలీ తర్వాత మళ్ళీ తన ముద్ర బలంగా వేయలేకపోయారు. టక్ జగదీశ్ ఓటిటిలో వచ్చినా ఫ్లాప్ అనిపించుకోగా ఖుషి అంచనాలు పూర్తి అందుకోలేకపోయింది. అందుకే కాస్త ఎక్కువ సమయం తీసుకుని ఇరుముడి మీద వర్క్ చేశారు. ఎక్కువగా అయ్యప్పని ఫోకస్ చేస్తున్నారు కానీ పబ్లిసిటీలో చూపించని రివెంజ్ పాయింట్ సినిమాలో చాలా బలంగా, ఇంటెన్స్ గా ఉంటుందని టాక్. ప్యారడైజ్ తప్పుకోవడం ఇరుముడికి చాలా ప్లస్ అయ్యింది. కాకపోతే వారం తిరక్కుండానే ఆగస్ట్ 26 యష్ 'టాక్సిక్' రావడం ఎలాంటి ప్రభావం చూపిస్తుందో చూడాలి. ఎందుకంటే ఇరుముడికి కేరళ మార్కెట్ చాలా కీలకం. జనాలు శబరిమల వెళ్లే ప్రణాళికలు ఈ నెల నుంచే ఊపందుకుంటాయి. అందుకే ఆ రాష్ట్రంలో మంచి రిలీజ్ చేయాలనేది నిర్మాణ సంస్థ మైత్రి ప్లాన్. ఇంకో ప్రధానమైన సమస్య ఏంటంటే దుల్కర్ సల్మాన్ ఐ యాం గేమ్ కూడా ఒక రోజు ముందు ఆగస్ట్ 20 విడుదలకు రెడీ కావడం. చూడాలి మరి ఈ రెండు ముప్పులను ఇరుముడి ఎలా ఫేస్ చేస్తుందో.

## సూర్య సరైన దారిలోకి వచ్చినట్టే



ఎప్పుడో గజిని తర్వాత అంత పెద్ద బ్లాక్ బస్టర్ మళ్ళీ చూడలేకపోయాననే సూర్య కొరతని కరుప్పు మూడు వందల కోట్లు తీసుకొచ్చి మరీ తీర్చింది. డబ్బింగ్ వెర్షన్ వీరభద్రుడు నెగటివ్ టాక్ లోనూ వసూళ్లు రాబట్టడం అనూహ్యమని చెప్పాలి. ఆగస్ట్ లో విశ్వనాథ్ అండ్ సన్స్ తో తక్కువ గ్యాప్ లో సూర్య మరోసారి ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. ఆల్రెడీ ఒక లిరికల్ సాంగ్ విడుదల చేయగా వచ్చే నెల నుంచి సితార ఎంటర్ టైన్మెంట్స్ ప్రమోషన్ల వేగం పెంచనుంది. దీని తర్వాత ప్రస్తుతం జీతూ మాధవన్ డైరెక్షన్లో సూర్య ఒక మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. కాక కాక, సింగం తర్వాత వాటిని మించిన పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో సూర్యని కొత్తగా చూస్తారని చెన్నై మీడియా తెగ చెబుతోంది. ఫహద్ ఫాసిల్ కు ఆవేశం లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన జీతూ మాధవన్ దర్శకుడు కావడంతో అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదింకా షూటింగ్ లో ఉండగా సూర్య తనకు జై భీం ఇచ్చిన టీజె జ్ఞానవేల్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇవాళ ఈ ప్రాజెక్టుకు సంబంధించి అఫీషియల్ అనౌన్స్ మెంట్ వచ్చేసింది. హోంబాలే ఫిలింస్ దీనికి నిర్మాతగా వ్యవహరించనుండగా కయదు లోహర్ హీరోయిన్ గా ఎంపికయ్యింది. ఇక్కడ సూర్య ప్లానింగ్ ని మెచ్చుకోవాలి. ఇకపై కెరీర్ లో ఎక్కువ గ్యాప్ రాకుండా జాగ్రత్త పడుతూ వరసగా సినిమాలను ఒప్పేసుకుంటున్నాడు. కంగువ, రెట్రో కొట్టిన దెబ్బల నుంచి కోలుకున్నాక ఇంత వేగంగా కంబ్యాక్ అవ్వడం అభిమానులను సంతోషం కలిగిస్తోంది. ఇకపై దీన్ని నిలబెట్టుకోవడం మీద సూర్య దృష్టి పెట్టాలి. ఏ చిన్న పొరపాటు జరిగినా మార్కెట్ మళ్ళీ మొదటికే వస్తుంది. విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి అయ్యాక ఇప్పుడున్న హీరోల్లో ఆయన వదిలేసిన మాస్ వర్గాన్ని తిరిగి ఆకట్టుకునే సత్తా ఉన్న హీరో సూర్యనే అని ఫ్యాన్స్ నమ్మకం. కాకపోతే సరైన కథలు, దర్శకులు, కాంబినేషన్లు పడాలి. సూర్య ఇంకొంచెం కష్టపడితే దాన్ని అందుకోవడం సులభమే. రజనీకాంత్ సెలెక్టివ్ అయిపోగా అజిత్ ఎక్కువగా ఆసక్తి చూపించడం లేదు.

# పోటీ పడుతున్న తెలుగు వెబ్ సిరీసులు



కరోనా తర్వాత ఫ్యామిలీ మ్యాన్, మిర్జాపూర్, స్కామ్ 1992 లాంటి బ్లాక్ బస్టర్స్ వల్ల కొంత కాలం వెబ్ సిరీస్ లకు విపరీతమైన ఆదరణ దక్కింది. ఎంతగా అంటే ఏదైనా కొత్త కంటెంట్ రిలీజవుతోందంటే అర్ధరాత్రి మేలుకుని మరీ స్ట్రీమింగ్ చేసే దాకా మూవీ లవర్స్ నిద్రపోయేవారు కాదు. అంతగా ఇవి జనంలోకి చొచ్చుకుపోయాయి. తర్వాత వీటి జోరు తగ్గింది. ఒకే జానర్ లో ఎక్కువ సిరీస్ లు రావడం వల్ల క్రమంగా వ్యూస్ తగ్గడం ఆరంభించాయి. ఇప్పుడీ ట్రెండ్ మళ్ళీ ఊపందుకునేలా ఉంది. ఇప్పటిదాకా హిందీకే అధిక శాతం పరిమితమైన వెబ్ సిరీస్ ఇప్పుడు తెలుగులోనూ స్పీడ్ పెంచుతున్నాయి. జూలై 3 ఏకంగా నాలుగు స్ట్రెయిట్ కంటెంట్లు రానుండటం విశేషమే అని చెప్పాలి. సందీప్ కిషన్ నటించిన 'సూపర్ సుబ్బు'ని చాలా సెన్సిటివ్ ఇష్యూ మీద వినోదాత్మకంగా తీసిన వైనం ట్రైలర్ లో కనిపిస్తోంది. నెట్ ఫ్లిక్స్ మొదటిసారి ఒక ఇమేజ్ ఉన్న హీరోతో తీసిన టాలీవుడ్ వెబ్ సిరీస్ ఇది. హీరో స్వయంగా పబ్లిసిటీలో భాగమవుతూ ఇంటర్వ్యూలలో దాని విశేషాలు చెబుతున్నాడు. సముతిరఖని, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలు పోషించిన 'ఇసుకపట్నం' ఇదే రోజు అమెజాన్ ప్రైమ్ లో ప్రీమియర్ కానుంది. మాఫియా, రాజకీయాలు, సముద్ర తీరం ఇలా తెలిసిన సెటప్ తీసుకున్నప్పటికీ ఇంటెన్స్ పొలిటికల్ డ్రామాగా తీర్చిదిద్దినట్టు చెబుతున్నారు. ఒకప్పుడు బుల్లితెరను ఊపేసిన మర్మదేశం ఆధారంగా తీసిన 'వీరభద్రుని రహస్యాలు' జీ ఫైవ్ లో రానుంది. పేరున్న సపోర్టింగ్ ఆర్టిస్టులు చాలా ఉన్నారు. సూర్య కరుప్పు తరహా ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి. బేబీ ఫేమ్ విరాజ్ అశ్విన్ నటించిన 'గుర్తుకొస్తున్నాయి' ఈటీవీ విన్ వేదికగా విడుదల చేయబోతున్నారు. నోస్టాల్జియా జ్ఞాపకాలకు తవ్వేలా కొంచెం కొత్త ప్రయత్నమే చేసినట్టు ఉన్నారు. ఒకపక్క థియేటర్లలో నాగబంధం, రావు బహదూర్ లాంటి రిలీజులు ఉండగా ఇంకోవైపు ఓటిటిలో కూడా చెప్పుకోదగ్గ ఆప్షన్లు ఆడియన్స్ ని ఊరిస్తున్నాయి. వీటిలో ఏవి ఏ మేరకు ఆదరణ పొందుతాయో ఒక వారం ఆగితే వ్యూస్ ని బట్టి స్పష్టత వస్తుంది. వీటికి ప్రమోషన్లు, ఈవెంట్లు కూడా ఘనంగా చేస్తున్నారు.



# బిజినెస్ న్యూస్



## నిరాశపర్చిన టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్.. 11% నష్టంతో ఎంట్రీ




ఇన్స్యూరెన్స్ కంపెనీ టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్ షేర్లు సోమవారం స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.152తో పోలిస్తే దాదాపు 11 శాతం తక్కువ ధరకు షేర్లు నమోదవడం మదుపర్లను నిరాశకు గురిచేసింది. బీఎస్ఈలో షేరు విలువ రూ.136.20 వద్ద మొదలై.. ఓ దశలో 13 శాతం కుంగి రూ.132.15కు పడిపోయింది. అటు ఎన్ఎస్ఈలోనూ 11.25 శాతం డిస్కౌంట్‌తో రూ.134.90 వద్ద ట్రేడింగ్‌ను మొదలుపెట్టింది. జూన్ 19 నుంచి 23 వరకు జరిగిన ఈ ఐపీఓకు బిడ్డింగ్ ఇన్వెస్టర్ల నుంచి అంతగా స్పందన రాలేదు. చివరి రోజు పూర్తయ్యేసరికి కేవలం 1.20 రెట్ల సబ్‌స్క్రిప్షన్ మాత్రమే నమోదు చేసింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.4,069.70 కోట్లుగా ఉంది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.883 కోట్లను ఇన్వెస్టర్ల నుంచి సమీకరించింది. ధరల శ్రేణిని రూ.144-152గా నిర్ణయించింది.

## లాకర్ టు మార్కెట్: పెరిగిన పాత బంగారం విక్రయాలు



బంగారాన్ని ఆభరణంగా ధరించేందుకు కొనుగోలు చేసేవారు కొందరైతే.. పెట్టుబడి సాధనంగా భావించి కొనేవారు ఇంకొందరు. ఇలా పెట్టుబడి పెట్టిన వారికి పసిడి ఇటీవల కాలంలో 'కనక వర్షం' కురిపించింది. కానీ, గడిచిన కొద్దిరోజులుగా పుత్తడి ధర దిద్దుబాటుకు లోనవుతోంది. మరింత పతనం అవుతుందన్న భయాలూ నెలకొన్నాయి. దీంతో కొందరు తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని విక్రయించి 'సొమ్ము' చేసుకుంటున్నారు. ఇంకా ధర పడిపోతే ఆ మేర లాభాన్ని కోల్పోతామని భావించి విక్రయాలకు దిగుతున్నారు. ఇండియా బులియన్, జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రకారం.. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశీయ కుటుంబాలు 50 టన్నుల బంగారాన్ని విక్రయించినట్లు తేలింది. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 43 శాతం అధికం. అంతర్జాతీయ పరిణామాలతో గడిచిన ఏడాదిగా ఆకాశమే హద్దుగా పెరిగిన పసిడి ధర.. గత కొన్నివారాలుగా తగ్గుముఖం పడుతుండడంతో లాభాల స్వీకరణకు దిగుతున్నారు. ఇంతకుమించి పెరగకపోవచ్చన్న అంచనాలే దీనికి కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో రూ.10 గ్రాముల బంగారం ధర రూ.1.20 లక్షల మార్కుకు పడిపోవచ్చన్న అంచనాలతో తమ వద్ద ఉన్న బంగారాన్ని, పసిడి ఆభరణాలను నగదుగా మార్చుకుంటున్నారంటూ ఎకనమిక్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది.

బంగారం ఎందుకు పడుతోంది?

అంతర్జాతీయంగా ఇటీవల కాలంలో పసిడి ధరలు ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య తాజా ఘర్షణలతో క్రూడాయిల్ ధరలు మళ్లీ పెరిగాయి. దీనికితోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచొచ్చన్న అంచనాలు బంగారం ధరల పతనానికి కారణమయ్యాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగితే సాధారణంగా పసిడిపై పెట్టుబడులు క్షీణిస్తాయి.

దిగుమతుల బిల్లు మిగులు

బంగారం ఇలా లాకర్ల నుంచి మార్కెట్‌లోకి రావడం వల్ల ఓ విధంగా భారత్‌కు మేలే. దేశంలోని కుటుంబాల వద్ద సుమారు 30వేల టన్నుల పసిడి ఉందనేది అంచనా. అయినా ఇప్పటికీ పెద్దఎత్తున బంగారాన్ని భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఇలా పాత బంగారం మార్కెట్‌లోకి రావడం వల్ల పసిడి రీసైక్లింగ్ ఇండస్ట్రీకి ప్రయోజనం చేకూరుతుంది. 2025లో 125-150 టన్నుల బంగారం మార్కెట్‌లోకి రాగా.. ప్రస్తుత ట్రెండ్ ఇలానే కొనసాగితే 200-250 టన్నుల బంగారం వస్తుందనేది అంచనా. ఇదే జరిగితే ఆ మేర పసిడి దిగుమతుల బిల్లు తగ్గుముఖం పడుతుంది. బంగారం కొనుగోళ్లను నిరాశ పరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఊతమిచ్చినట్లు అవుతుంది.

## 6+6 అప్‌డేట్స్‌తో శాంసంగ్ గెలాక్సీ M47 విడుదల



ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ శాంసంగ్ వీ సిరీస్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. శాంసంగ్ గెలాక్సీ m+47 5J (Samsung Galaxy M47 5G) పేరిట లాంచ్ చేసింది. ఎప్పటిలానే 6o6 ఓఎస్, సెక్యూరిటీ అప్‌డేట్స్‌లను అందిస్తోంది. స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్, 6000mAh బ్యాటరీతో వస్తోంది. మరి ఫీచర్లను పరిశీలిస్తే..

శాంసంగ్ గెలాక్సీ వీ47 ఫీచర్లు ఇవే..

6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీం సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120ఎట రిఫ్రెష్ రేటు, 1400 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ం ప్రొటెక్షన్ ఇచ్చారు. LPDDR5X RAMతో కూడిన స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్ ఇచ్చారు. ఆండ్రాయిడ్ 16 ఆధారిత వన్ UI 8.5తో పనిచేస్తుంది.

కెమెరా విషయానికొస్తే.. వెనుకవైపు ట్రిపుల్ కెమెరా ఇచ్చారు. 50 ఎంపీ ఓఐఎస్ ప్రధాన కెమెరాం 50 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరాం2 ఎంపీ మాక్రో కెమెరా ఉంది. ముందు వైపు 12 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6000ఎంఏహెచ్ బ్యాటరీ, 45ఔ వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. బైపాస్ ఛార్జింగ్ సపోర్టు ఉంది. మై ఫిల్టర్, ఆబ్జెక్ట్ ఎరేజర్ వంటి ఏఐ ఫీచర్లను అందిస్తోంది. స్టీరియో స్పీకర్స్, యూఎస్‌బీ టైప్-సీ, జీపీఎస్, బ్లూటూత్ వంటి కనెక్టివిటీ సదుపాయం ఉంది. హైబ్రీడ్ స్లాట్‌తో వస్తున్న ఈ ఫోన్‌లో ఒక సిమ్, మెమొరీ కార్డు లేదా రెండు సిమ్ కార్డులు వేసుకోవచ్చు అమెజాన్ ప్రైమ్ డే సేల్‌లో భాగంగా కూపన్, బ్యాంక్ ఆఫర్‌తో కలుపుకొని శాంసంగ్ గెలాక్సీ వీ47 ధరను రూ.22,999గా కంపెనీ నిర్ణయించింది. ఒరిజినల్ ధర ఎంతనే వివరాలు వెల్లడించలేదు. జులై 4 నుంచి అమెజాన్, శాంసంగ్ ఇండియా వెబ్‌సైట్, సంబంధిత రిటైల్ స్టోర్‌లలో అందుబాటులోకి రానుంది.

## లాభాలకు బ్రేక్..

### నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!




సోమవారం ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 372.10 పాయింట్లు లేదా 0.48 శాతం లాభంతో 76,728.37 వద్ద, నిఫ్టీ 109.75 శాతం లేదా 0.46 శాతం నష్టంతో 23,946.25 వద్ద నిలిచాయి. ప్రకాష్ పైప్స్ లిమిటెడ్, బజాజ్ హెల్త్‌కేర్ లిమిటెడ్, మాక్‌పవర్ సిఎన్‌సి మెషీన్స్ లిమిటెడ్, సినీవిస్టా లిమిటెడ్, బోరోసిల్ సైంటిఫిక్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్, టార్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్, క్రెబ్స్ బయోకెమికల్స్ ఉ ఇండస్ట్రీస్ లిమిటెడ్, అటల్ రియల్‌టెక్ లిమిటెడ్, కన్సాలిడేటెడ్ కన్స్ట్రక్షన్ కన్సార్టియం లిమిటెడ్ వంటివి నష్టాల జాబితాలో నిలిచాయి.

## ఐవెకో కొనుగోలుతో 10 లక్షల వాహనాలు లక్ష్యం!



భారతీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ అంతర్జాతీయ వాణిజ్య వాహన (కమర్షియల్ వెహికల్స్) మార్కెట్లో చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. ఇటలీకి చెందిన ప్రముఖ 'ఐవెకో' కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరిన నేపథ్యంలో.. రాబోయే కొద్ది సంవత్సరాల్లోనే వార్షిక అమ్మకాల్లో మిలియన్ (10 లక్షలు) యూనిట్ల మార్కును అధిగమించాలని కంపెనీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. జూన్ 29న జరిగిన కంపెనీ రెండో వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) వాటాదారులను ఉద్దేశించి టాటా మోటార్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ కొన్ని విషయాలను వెల్లడించారు. కమర్షియల్ వెహికల్ బిజినెస్ ప్రత్యేకంగా విడిపోయి స్వతంత్ర సంస్థగా లిస్ట్ అయిన తర్వాత జరిగిన ఈ సమావేశంలో చంద్రశేఖరన్ ప్రసంగిస్తూ ప్రతిపాదిత ఐవెకో కొనుగోలు టాటా మోటార్స్ అంతర్జాతీయ ఆశయాలకు వేగాన్ని ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'ఐవెకో గ్రూప్ ఏకీకరణతో ప్రాథమికంగానే మా ఉమ్మడి వ్యాపారం 6,00,000 వాహనాల వార్షిక వాల్యూమ్‌తో ప్రారంభమవుతుంది. రాబోయే సంవత్సరాల్లో 10 లక్షల వాహనాల మార్కును సులభంగా దాటగలము. ఈ వ్యూహాత్మక చర్యతో ప్రపంచవ్యాప్తంగా టాప్-4 అతిపెద్ద కమర్షియల్ వెహికల్ తయారీదారుల సరసన టాటా మోటార్స్ నిలుస్తుంది' అని ఎన్.చంద్రశేఖరన్ అన్నారు.

రెండో త్రైమాసికంలో డీల్ పూర్తి

ప్రస్తుతం ఈ కొనుగోలుకు సంబంధించి తుది విడత రెగ్యులేటరీ అనుమతుల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నాటికి ఈ డీల్ పూర్తిగా ముగుస్తుందని చంద్రశేఖరన్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఐవెకోకు ఉన్న అధునాతన పవర్ ట్రెయిన్, నెక్స్ట్ జనరేషన్ సాంకేతికతలపై టాటా మోటార్స్‌కు పూర్తి పట్టు లభిస్తుంది. తద్వారా కంపెనీ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియో మరింత బలోపేతం కానుందని చెప్పారు.

